విశాఖపట్టణం
బుధవారం 16 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 215 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని కన్నుమూత



గుండెపోటుతో విశాఖలో మృతి

ఏలూరు నియోజకవర్గం నుంచి మూడుసార్లు గెలుపు

కరోనా సమయంలో కీలక సేవలు

2




### వ్యక్తిగత నగదు బదిలీపై

# చార్జీలు లేవు

**రూ. 2 వేలకు మించి వ్యాపారులకు చెల్లిస్తే చార్జీ**

**వ్యాపారులకు 0.4 శాతం వ్యాపారి నుంచి వసూలు**

**అక్టోబర్ 15 నుంచి అమల్లోకి కొత్త నియమాలు**

**డిజిటల్ చెల్లింపులపై కేంద్రం కీలక సంస్కరణలు**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

భారత్‌లో విస్తృతంగా ఉపయోగిస్తున్న డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యూపీఐ వినియోగదారులకు కేంద్రం నుంచి బిగ్ న్యూస్ వచ్చింది. చిన్న తరహా చెల్లింపులు, వ్యక్తిగత నగదు బదిలీలపై ఎలాంటి రుసుములు విధించబోమని స్పష్టం చేసింది. అయితే వ్యాపారులకు సంబంధించి రూ.2,000 కంటే ఎక్కువ విలువైన పెద్ద లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ రుసుమును విధించే అంశంపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకుంది. వ్యాపారులకు వ్యక్తులు రూ.2000 కంటే ఎక్కువ యూపీఐ ..మిగతా 2లో

# హౌసింగ్ ఫర్ ఆల్..!

**ప్రతీ కుటుంబానికి సొంతిల్లు**

**2027 నాటికి 5.52 లక్షల ఇళ్ల నిర్మాణాలు**

**పీఎం ఆవాస్ యోజన, పీఎం జన్ మన్‌లను గ్రౌండిగ్ చేయాలి**

**అర్హులను ఎంపిక చేసి సచివాలయాల్లో ప్రదర్శించాలి**

**సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు**





(అమరావతి - జయజయహే)

అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. 2029 నాటికి అర్హులైన ప్రతి కుటుంబానికి సురక్షితమైన, శాశ్వతమైన ఇల్లు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. 'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని సంతృప్తి స్థాయిలో అమలు చేయాలని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్, పీఎం జన్‌మన్ సహా వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణాలను వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో మరో 1.5 లక్షల ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. డిసెంబర్ 2026 నాటికి 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యాలను నిర్దేశించారు. రాష్ట్రంలో పీఎంఏవై 1.0, పీఎంఏవై 2.0, పీఎం జన్‌మన్ పథకాల కింద 18.72 లక్షల ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 13.20 లక్షల ఇళ్లు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో 16.11 లక్షల ఇళ్లకు గాను 11.31 లక్షలు, ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గాను ..మిగతా 2లో

# వచ్చేస్తున్నాయ్.. మున్సిపోల్స్..!

**రంగం సిద్ధం చేస్తున్న ఎన్నికల సంఘం**

**డీలిమిటేషన్ పూర్తయిన ప్రాంతాల్లో నిర్వహణ**

**తొలదశలో విజయనగరం కార్పొరేషన్ కు ఎన్నికలు**

**త్వరలో షెడ్యూల్ ప్రకటించనున్న ఈసీ**

(అమరావతి - జయజయహే)

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. మున్సిపల్ సమరానికి అత్యంత కీలకమైన వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాల ప్రచురణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ముహూర్తం ఖరారు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన మిగిలిన 41 పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి ఈ నెల 22న తుది ఓటర్ల ..మిగతా 2లో





# సస్పెన్షన్ ఎత్తివేత..!

**విశాల్ గున్నీ, క్రాంతి రాణాలకు పోస్టింగ్**

**తిరిగి విధుల్లోకి తీసుకోన్నట్లు ప్రభుత్వ ఉత్తర్వులు**

(అమరావతి - జయజయహే)

రాష్ట్రానికి చెందిన ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీపై గతంలో విధించిన సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ మేరకు వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాంతి రాణా టాటాను ఈ నెల 4వ తేదీ నుంచి విధుల్లోకి తీసుకుంటున్నట్లు ..మిగతా 2లో




### 892 పోస్టులకు

# నోటిఫికేషన్

**20 శాఖల్లో రిక్రూట్ మెంట్**

**నిరుద్యోగులకు ప్రభుత్వం గుడ్ న్యూస్**

(అమరావతి - జయజయహే)

ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించిన ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా నేడు 20 శాఖలకు సంబంధించిన రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. గ్రూప్-1 సహా మొత్తం 892 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటికి అక్టోబర్ 16 నుంచి నవంబర్ 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. ప్రస్తుతం 20 శాఖలకు ..మిగతా 2లో

# తగ్గిన వరి సాగు విస్తీర్ణం

**రాష్ట్రంలో 1.90 లక్షల హెక్టార్లలో తగ్గుముఖం**

**దేశవ్యాప్తంగా 4 శాతం మేర తగ్గుదల**

**ఇదే దారిలో దక్షిణాది రాష్ట్రాలు**

**ఖరీఫ్ సీజన్ లో పడగ విప్పిన ఎల్ నినో**



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ప్రస్తుత 2026 ఖరీఫ్ సీజన్‌లో దేశవ్యాప్తంగా వరి సాగు గణనీయంగా తగ్గినట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సెప్టెంబర్ 11 నాటికి అందిన అధికారిక డేటా ప్రకారం.. దేశంలో వరి సాగు విస్తీర్ణం 4 శాతం మేర తగ్గి 426.81 లక్షల హెక్టార్లకు పరిమితమైంది. గత ఏడాది ఇదే సమయానికి దేశంలో 443.78 లక్షల హెక్టార్లలో వరి పంట సాగవ్వడం గమనార్హం. దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటకలో వర్షభావ పరిస్థితులు, వర్షపాత లేమి కారణంగా వరి సాగు విస్తీర్ణం భారీగా తగ్గినట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం, వివిధ రాష్ట్రాల్లో తగ్గిన వరి సాగు విస్తీర్ణం వివరాలు. కర్ణాటకలో వరి సాగు విస్తీర్ణం 4.54 లక్షల హెక్టార్లు, తెలంగాణలో 4.46 లక్షల హెక్టార్లు, ఆంధ్రప్రదేశ్‌లో 1.90 లక్షల హెక్టార్లు, ఉత్తరప్రదేశ్‌లో 1.84 లక్షల హెక్టార్లు, మధ్యప్రదేశ్‌లో ..మిగతా 2లో



# ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లకు ఓకే!

2

**అనుమతి ఇచ్చిన ప్రభుత్వం**

**64,143 ఎకరాలకు ఉత్తర్వులు లేకుండానే రిజిస్ట్రేషన్లు**

**గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచన**

# వచ్చేస్తున్నాయ్.. మున్సిపోల్స్..!




**మొదటి పేజీ తరువాయి...**

జాబితాలను అధికారికంగా ప్రచురించనున్నారు. ఇందులో 12 ప్రముఖ మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీలు ఉన్నాయి. దీంతో రాష్ట్రంలో మున్సిపల్ పోరుకు సంబంధించిన కసరత్తు ఊపందుకుంది. రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన విశాఖపట్నం, విజయవాడ, గుంటూరులతో పాటు ఏలూరు, మచిలీపట్నం, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాల రూపకల్పన ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. సెప్టెంబర్ 22న ఈ జాబితాలు బహిర్గతం కానుండటంతో ఆయా కార్పొరేషన్లలో ఎన్నికల నిర్వహణపై పూర్తి స్పష్టత రానుంది. అంతేకాకుండా రాబోయే ఎన్నికల్లో మేయర్ స్థానాలతో పాటు డివిజన్, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేయడానికి ఈ ఓటర్ల లెక్కలే కీలకం కానున్నాయి.

### 29 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు ఇవే..

కార్పొరేషన్లతో పాటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 29 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ సెప్టెంబర్ 22న ఓటర్ల జాబితాలను ప్రదర్శించనున్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా నుంచి రాయలసీమ వరకు విస్తరించి ఉన్న పార్వతీపురం, సాలూరు, నర్సీపట్నం, పిఠాపురం, రామచంద్రాపురం, పెదన, జగ్గయ్యపేట, మాచర్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట, వినుకొండ, చీరాల, మార్కాపురం, పుత్తూరు, పలమనేరు, నగరి తదితర పట్టణాలు ఈ లిస్ట్‌లో ఉన్నాయి. వీటితో పాటు రాయచోటి, ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేల్, జమ్మలమడుగు, యర్రగుంట్ల, కమలాపురం, రాయదుర్గ్, తాడిపత్రి, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, నంద్యాల మున్సిపాలిటీల ఓటర్ల వివరాలు ఆ రోజున విడుదల కానున్నాయి.

### జనవరి 1, 2026 అర్హత తేదీగా ప్రామాణికం

ఈ వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాల రూపకల్పనకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం జనవరి 1, 2026ను అర్హత తేదీగా నిర్ణయించారు. ఇటీవల నిరంతర సవరణల ద్వారా అప్‌డేట్ చేసిన అసెంబ్లీ ఓటర్ల జాబితాలను ప్రాతిపదికగా తీసుకుని, వార్డుల సరిహద్దులకు అనుగుణంగా ఓటర్ల వివరాలను విభజించి పొందుపరుస్తున్నారు. ఆయా పట్టణాల్లో డీలిమిటేషన్ ప్రక్రియ ముగియడంతో ఓటర్ల జాబితాల తయారీ నిరాటంకంగా సాగుతోంది.

### వేగవంతమైన ఎన్నికల ప్రక్రియ

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ఇప్పటికే పలు దశల్లో వేగం పుంజుకుంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో సెప్టెంబర్ 3నే వార్డుల వారీ ఓటర్ల జాబితాల ప్రచురణ పూర్తయింది. అలాగే డీలిమిటేషన్ పూర్తయిన మొత్తం 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఇప్పటికే 58 పట్టణాల్లో ఓటర్ల జాబితాల ప్రక్రియ ముగిసింది. తాజాగా మిగిలిన 41 పట్టణ స్థానిక సంస్థలకు సెప్టెంబర్ 22న జాబితాలు ప్రచురిస్తుండటంతో పట్టణ పోరుకు సంబంధించిన కీలక ఘట్టం పూర్తికానుంది. త్వరలోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశాలు కనిపిస్తుండటంతో రాజకీయ పార్టీల్లో ఎన్నికల వేడి మొదలైంది.



# హౌసింగ్ ఫర్ ఆల్..!

**మొదటి పేజీ తరువాయి...**

1.88 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. ఇంటి స్థలాలు లేని కుటుంబాలను గుర్తించేందుకు ఆర్టీజీఎస్, ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖల డేటాను అనుసంధానం చేసి డూప్లికేషన్ లేకుండా అర్హులను ఎంపిక చేయాలని సీఎం ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో జాబితాలను ప్రచురించి అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం తుది జాబితాలను ఖరారు చేయాలని సూచించారు. ఇక కేంద్ర సహకారంతో శ్రీసిటీ సహా పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌ల ఏర్పాటుపైనా దృష్టి పెట్టాలని సీఎం తెలిపారు. ఏపీఐఐసీతో సమన్వయం చేసుకుని ఈ టౌన్‌షిప్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# సస్పెన్షన్ ఎత్తివేత..!

**మొదటి పేజీ తరువాయి...**

ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే విశాల్ గున్నీని సెప్టెంబరు 5వ తేదీ నుంచి విధుల్లోకి తీసుకున్నట్లు పేర్కొంది. ముంబైకి చెందిన నటి కాదంబరీ జెత్వానీపై ఇబ్రహీంపట్నం పోలీసులు ఓ ఫోర్జరీ పత్రాన్ని ఆధారంగా చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో అప్పటి ఐపీఎస్ అధికారులు పి. సీతారామాంజనేయులు (పీఎస్ఆర్), కాంతి రాణా టాటా, విశాల్ గున్ని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీ నేత విద్యాసాగర్‌తో కలిసి అధికారులు కుట్రకు పాల్పడ్డారని, రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో తప్పుడు పత్రాలు, రికార్డులు సృష్టించి కాదంబరీ జెత్వానీతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేసి వేధించారు. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో ప్రభుత్వం సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న నిఘా విభాగం మాజీ అధిపతి పి. సీతారామాంజనేయులు కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు. అనంతరం ఆయన ఆగస్టు నెలలో పదవీ విరమణ చేశారు. కాగా, ఇదే కేసులో సస్పెండ్ అయిన ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నిపై ప్రభుత్వం తాజాగా సస్పెన్షన్‌ను ఎత్తివేసింది.

## 892 పోస్టులకు

# నోటిఫికేషన్

**మొదటి పేజీ తరువాయి...**

సంబంధించి పోస్టులకు నోటిఫికేషన్ విడుదల అయ్యాయి. ఐదు శాఖలకు సంబంధించి పోస్టులకు రేపు నోటిఫికేషన్ విడుదల కానుంది. మరో పది శాఖలకు సంబంధించి పోస్టులకు ఈనెల 24న నోటిఫికేషన్ విడుదల కానుంది. 163 గ్రూప్–1 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ : ఒకేసారి వివిధ విభాగాల్లో భారీగా పోస్టుల భర్తీకి సంబంధించి ఈ ఉదయం నోటిఫికేషన్ విడుదల చేసింది. 163 గ్రూప్–1 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ మేరకు తన వెబ్సైట్లో పోస్టుల వివరాలను వెల్లడించింది. మొత్తం పోస్టులు 163 పోస్టుల్లో డిప్యూటీ కలెక్టర్లు 11 , ఏపీ టాక్స్ సర్వీసెస్ అసిస్టెంట్ కమిషనర్ల పోస్టులు 14, డీఎస్పీ సివిల్ పోస్టులు 36, డీఎస్పీ కమ్యూనికేషన్స్ పోస్టులు 3, డీఈవోలు 14, ఆర్టీవోలు 3, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ 1, డిప్యూటీ రిజిస్టర్ కోపరేటివ్ సర్వీసెస్ పోస్టులు 15, మునిసిపల్ కమిషనర్ గ్రేడ్ 2 పోస్టులు 12, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ పోస్టులు 2, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ పోస్టులు 3, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ 14 , డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ పోస్టులు 35 భర్తీ చేస్తున్నట్లు ప్రకటనలో తెలిపింది. గ్రూప్ వన్ పోస్టులకు అక్టోబర్ 6 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని వెల్లడించింది.

### అక్టోబరు 9 నుంచి దరఖాస్తులు స్వీకరణ

అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులు 40, హార్టికల్చర్ ఆఫీసర్ 37, అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీలో 8 పోస్టులు భర్తీకి నోటిఫికిషన్ ఇచ్చింది. వీటికి అక్టోబరు 6 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలు కానుంది. అలాగే బీసీ సంక్షేమశాఖలో హాస్టర్ వెల్ఫేర్ గ్రేడ్ ఆఫీసర్ పోస్టులు 29, సాంఘిక సంక్షేమ శాఖలో హాస్టర్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ 2 పోస్టులు 21, ట్రైబల్ డిపార్ట్మెంట్లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ పోస్టులు 23, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఇన్ ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ పోస్టులు 6 భర్తీ చేయనున్నారు. వీటికి అక్టోబరు 9 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. నోటిఫికేషన్‌లో అత్యధికంగా అసిస్టెంట్ స్టాటస్టికల్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. మొత్తం 196 పోస్టులు ఈ విభాగం కింద భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. వీటికి అక్టోబరు 13 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఏపీ ఎండోమెంట్ సబార్డినేట్ సర్వీసస్‌లో 104 గ్రేడ్ 3 ఎక్సిక్యుటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు.

## వ్యక్తిగత నగదు బదిలీపై

# చార్జీలు లేవు



**మొదటి పేజీ తరువాయి...**

పేమెంట్స్ చేస్తే.. ఆ చెల్లింపులపై 0.4 శాతం ఛార్జీ వర్తిస్తుందని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. అంటే రూ.2000 లోపు పేమెంట్స్ ఎండీఆర్ పరిధిలోకి రావు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫైనాన్షియల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ సెప్టెంబర్ 14న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం.. ఈ నూతన నిబంధనలు అక్టోబర్ 15 నుండి అమలులోకి రానున్నాయి.

### సాధారణ జనాల పరిస్థితేంటి?

ఈ కొత్త విధానం వల్ల సాధారణ పౌరులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఎప్పటిలాగే యూపీఐ లావాదేవీలు ఉచితంగా చేసుకోవచ్చు. మీరు షాపుల్లో, టీ కొట్టు వద్ద, కూరగాయల మార్కెట్‌లో లేదా కిరాణా షాపుల్లో చేసే సాధారణ యూపీఐ చెల్లింపులపై ఎలాంటి ఛార్జీలు పడవు. ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి (పీ2పీ) పంపే డబ్బులపై ఎలాంటి రుసుములు ఉండవు. బ్యాంకులకు లేదా పేమెంట్ యాప్‌లకు రూ.2,000 వరకు ఉండే యూపీఐ లావాదేవీల పై ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఛార్జీలు వసూలు చేసే అధికారం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. రూపే డెబిట్ కార్డుల ద్వారా జరిగే లావాదేవీలకు కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది. ఎండీఆర్ ఛార్జీలు చిన్న వ్యాపారులకువర్తించవు. నెలకు రూ.లక్ష వరకు బ్యాంక్ ఖాతాలోకి క్యూఆర్ కోడ్ ద్వారా స్వీకరించే చిన్న వ్యాపారులకు ఈ విధానం ఉండదు. రైల్వేలు, టెలికాం సేవలు, బీమా, ఇంధనంలాంటి వాటికి రూ.2000 దాటితే ఒక్కో లావాదేవీకి ఫ్లాట్‌గా రూ.5 ఎండీఆర్ వర్తిస్తుంది. ఒక్కో లావాదేవీకి ఎండీఆర్ రుసుము గరిష్టంగా రూ.300 మించకుండా పరిమితి విధించారు. దేశవ్యాప్తంగా జరిగే మొత్తం యూపీఐ లావాదేవీలలో సుమారు 96 శాతం చెల్లింపులు రూ.2,000 కంటే తక్కువ విలువైనవే. వ్యాపార సంస్థలకు జరిగే (పీ2వీ) చెల్లింపుల్లో కేవలం 4 శాతం లావాదేవీలు మాత్రమే రూ.2,000 కంటే ఎక్కువ విలువ కలిగి ఉన్నాయి. కాబట్టి మెజారిటీ ప్రజలపై ఈ నిర్ణయం ఎలాంటి ఆర్థిక భారం వేయదు. ఈ రుసుమును కేవలం వ్యాపారుల నుంచి మాత్రమే వసూలు చేస్తారు తప్ప కొనుగోలుదారుల (వినియోగదారుల) నుంచి కాదు. ఈ రుసుముల ద్వారా వచ్చే ఆదాయంలో 40 శాతం బ్యాంకులకు, మిగిలిన 60 శాతం మొత్తాన్ని సంబంధిత పేమెంట్ యాప్‌లు, అగ్రిగేటర్లు చెరిసగం పంచుకునేలా ప్రణాళిక రూపొందించారు. రూ.3వేలు పేమెంట్ చేస్తే రూ.12, రూ.50వేలకు రూ.200, రూ.75వేల పైన పేమెంట్ చేస్తే రూ.300లు వ్యాపారులు చెల్లించాలి.

### యూపీఐ రికార్డు స్థాయి వృద్ధి

ఎన్‌పీసీఐ నివేదిక ప్రకారం గత ఆగస్టు (2026) ఒక్క నెలలోనే యూపీఐ ద్వారా 2,450 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయి. వీటి మొత్తం విలువ దాదాపు రూ.29.82 లక్షల కోట్లు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో భారత్ సాధించిన ఈ అసాధారణ ప్రగతిని దృష్టిలో ఉంచుకుని, చిన్న వ్యాపారులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నదని అధికారులు చెబుతున్నారు.



## మాజీ డిప్యూటీ సీఎం

# ఆళ్ల నాని కన్నుమూత

### గుండెపోటుతో విశాఖలో మృతి

### ఏలూరు నియోజకవర్గం నుంచి మూడుసార్లు గెలుపు

### కరోనా సమయంలో కీలక సేవలు

**(విశాఖపట్నం - జయజయహే)**

రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మాజీ వైద్యారోగ్య శాఖ మంత్రి, ఏలూరు మాజీ శాసనసభ్యుడు ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్(ఆళ్ల నాని) గుండెపోటుతో కన్నుమూశారు. అకస్మాత్తుగా ఆయన గుండెపోటుకు గురికావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించినప్పటికీ పరిస్తితి చేయి దాటిపోయింది. ఆళ్ల నాని తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆయన అకాల మరణం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వాసులను, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయాల్లో ఆళ్ల నాని తనదైన ముద్ర వేశారు. ప్రజలతో నిరంతరం మమేకమయ్యే నాయకుడిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. 2004లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఏలూరు నియోజకవర్గం నుంచి ఆయన మొదటిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2009లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత ఎమ్మెల్సీగా కూడా పని చేశారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరి 2019లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మొత్తం మూడుసార్లు ఎమ్మెల్యేగా ప్రజాసేవ అందించారు. 2019 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆళ్ల నాని కీలక బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రభుత్వ నిర్ణయాల్లో చురుగ్గా వ్యవహరించారు. వైద్యా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ, కోవిడ్–19 పాండమిక్ సమయంలో నిరంతరం శ్రమిస్తూ వైద్యా సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా పర్యవేక్షించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అమలు, నాడు–నేడు ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునీకరణలో ఆయన కీలక పాత్ర పోషించారు. 2025లో టీడీపీలో చేరారు ఆళ్ల నాని. ఆళ్ల నాని ఆకస్మిక మరణ వార్త తెలిసిన వెంటనే పలువురు రాజకీయ ప్రముఖులు, పార్టీ నేతలు, అభిమానులు సంతాపాన్ని ప్రకటించారు. టీడీపీ అధినేత చంద్రబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డితో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సంతాపం తెలిపారు. నాని ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు ఇలాంటి పరిస్థితుల్లో ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

# తగ్గిన వరి సాగు విస్తీర్ణం

**మొదటి పేజీ తరువాయి...**

1.75 లక్షల హెక్టార్లు, తమిళనాడులో 1.40 లక్షల హెక్టార్లు, మహారాష్ట్రలో 1.15 లక్షల హెక్టార్లు, జార్ఖండ్‌లో 0.97 లక్షల హెక్టార్ల మేర తగ్గింది. ఖరీఫ్ సీజన్‌లో అతిముఖ్యమైన ఈ వరి పంట కోతలు అక్టోబర్ నెల నుంచి ప్రారంభం కానున్నాయి. వరి పంట విస్తీర్ణం తగ్గినప్పటికీ, పప్పుధాన్యాల సాగులో స్వల్ప పురోగతి కనిపించింది. గత ఏడాది 116.79 లక్షల హెక్టార్లుగా ఉన్న పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం ఈసారి 118.46 లక్షల హెక్టార్లకు పెరిగింది. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం 182.48 లక్షల హెక్టార్ల నుండి 183.17 లక్షల హెక్టార్లకు స్వల్పంగా పెరిగింది. నూనెగింజల పంటల విస్తీర్ణం గత ఏడాది 194.07 లక్షల హెక్టార్లుగా ఉండగా, ఈసారి 193.90 లక్షల హెక్టార్లకు తగ్గింది. పత్తి సాగు 110.31 లక్షల హెక్టార్ల నుండి 109.34 లక్షల హెక్టార్లకు పడిపోయింది. చెరకు సాగు విస్తీర్ణం కూడా 58.87 లక్షల హెక్టార్ల నుంచి 58.47 లక్షల హెక్టార్లకు స్వల్పంగా తగ్గింది. దేశంలో వర్షపాతం లోపించడం వల్ల మొత్తం ఖరీఫ్ పంటల సాగు తగ్గింది. గత సంవత్సరం సెప్టెంబర్ 11 నాటికి మొత్తం ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం 1,112.54 లక్షల హెక్టార్లుగా నమోదు కాగా.. ఈ 2026 సెప్టెంబర్ 11 నాటికి అది 1,096.49 లక్షల హెక్టార్లకు పరిమితమైంది.

# ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లకు ఓకే!

## అనుమతి ఇచ్చిన ప్రభుత్వం

### 64,143 ఎకారాలకు ఉత్తర్వులు లేకాండానే రిజిస్ట్రేషన్లు

### గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచన

**(అమరావతి - జయజయహే)**

రాష్ట్రంలో ఫ్రీ హోల్డ్ హక్కులు పొందిన 7,85,500 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అసైన్డ్ భూములుగా తప్పుగా నమోదు చేసిన.. 5,422 ఎకరాల ప్రైవేట్ పట్టా భూములకు ఆంక్షలు లేకుండా రిజిస్ట్రేషన్లకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఫ్రీ హోల్డ్ భూములపై కూటమి సర్కార్ మంగళవారం జీఓ జారీ చేసింది. ఫ్రీ హోల్డ్‌కు అర్హత ఉండి ప్రొసిడింగ్స్ కాని.. 64,143 ఎకరాల భూములకు ఉత్తర్వులు లేకుండానే రిజిస్ట్రేషన్‌కు వెసులుబాటు కల్పించింది. చుక్కల భూముల చట్టం–2017 కిందకు వచ్చే 17,897 ఎకరాల భూములకు రిజిస్ట్రేషన్ల నిర్వహణకు పచ్చ జెండా ఊపింది. అసైన్‌మెంట్ జరిగి 20 ఏళ్లు నిండని 28,292 ఎకరాలకు.. సంబంధించి గడువు పూర్తయ్యాకే రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇచ్చింది. నిబంధనలు ఉల్లంఘించి ఫ్రీ హోల్డ్ చేసిన 38,733 ఎకరాలు, లబ్ధిదారుల స్వాధీనంలో లేని 25,486 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. ఉల్లంఘనలు, స్వాధీనం చేయని భూములపై.. ఆర్డీవో లేదా సబ్ కలెక్టర్లతో సమగ్ర విచారణ చేయాలని ఆదేశించింది. వెబ్‌లాండ్‌లో అసైన్డ్‌గా ఉండి అదనపు ఆధారాలు లేని 2,87,53 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లు పరిశీలన కోసం హోల్డ్‌లో ఉంచింది. నీటి వనరులు / జల విభాగాలు కానీ 24,261 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చింది. మున్సిపల్ కార్పొరేషన్ల వెలుపల ఫ్రీ హోల్డ్ హక్కుల మంజూరు అధికారాలను.. ఆర్డీవో లేదా సబ్ కలెక్టర్లకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆర్డీవో ఉత్తర్వులపై అసంతృప్తి ఉంటే 60 రోజుల్లోగా జాయింట్ కలెక్టర్‌కి అప్పీల్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఫ్రీ హోల్డ్ హక్కుల కోసం లబ్ధిదారులు.. గ్రామోద్యోగ/స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

# మాజీ మంత్రి ఆళ్ల నాని మృతి తీవ్ర విషాదకరం: కెకె రాజు

**విశాఖపట్నం (జయ జయహే)**





మాజీ మంత్రి ఆళ్ల నాని ఆకస్మికంగా మృతి చెందారనే వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కెకె రాజు అన్నారు. ఆళ్ల నాని ప్రజా జీవితంలో సుదీర్ఘకాలం సేవలందించారని, వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రి (వైద్య ఆరోగ్య శాఖ) గా బాధ్యతలు నిర్వహించి ప్రజలకు సేవ చేశారని కెకె రాజు గుర్తు చేసుకున్నారు. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆయనకు శాసనసభ్యుడిగా, శాసనమండలి సభ్యుడిగా అవకాశం కల్పించారని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. సీతమ్మధారలో ఉన్న ఆళ్ల నాని నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయనికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు కెకె రాజు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

# త్వరలో ఇళ్ల పట్టాలు...ఇంటింటికీ తాగునీరు





## - అధికారుల విధుల్లో అలసత్వాన్ని ఉపేక్షించేది లేదు

## హోం మంత్రి అనిత

**నక్కపల్లి, సెప్టెంబర్ 15, జయ జయహే**

పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో ఇల్లు ఉండి పట్టాలు లేని, అర్హులకు త్వరలోనే ఇళ్ల పట్టాలు అందించే చర్యలు చేపడతామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అలాగే జల జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఎలక్ట్రికల్, పీఆర్ ప్రాజెక్ట్స్, ఎండోమెంట్, పీఆర్ ఇంజినీరింగ్ తదితర శాఖల పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాయకరావుపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అనిత అన్నారు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని, విధుల్లో ఎలాంటి అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లి జిల్లాకు తీసుకురావడం ఎంతో సంతోషకరమైన విషయమని మంత్రి అన్నారు. పాయకరావుపేట ప్రాంతంలో పోలవరం కాలువ పరిసరాలను భవిష్యత్తులో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలు, వివిధ వసతులు కల్పిస్తోందని చెప్పారు. గ్రామస్థాయిలో ట్రాఫిక్ నిబంధనలపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని హోం మంత్రి సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని గ్రామాల్లో కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులకు సూచించారు.



## వినాయక విగ్రహాలను దర్శించుకున్న జనసేన మండల అధ్యక్షుడు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

జనసేన పార్టీ నిడదవోలు మండల అధ్యక్షుడు పోలిరెడ్డి వెంకటరత్నం నిడదవోలు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను దర్శించుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కాటకోటేశ్వరం గ్రామంలో బాలలతో కలిసి బాలగణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉనకరమిల్లి, కాటకోటేశ్వరం, సూరాపురం గ్రామాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. గ్రామాల్లో వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని వెంకటరత్నం తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు, జనసేన నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలని ఆయన సూచించారు.

# విశాఖలో తీవ్రమైన తాగునీటి సంక్షోభం

## - ఈ దుస్థితికి కూటమి ప్రభుత్వ అసమర్థత

## - నాలుగు రోజుల్లో పరిష్కరించకపోతే జీవీఎంసీ కార్యాలయం ముట్టడిస్తాం..

## - జీవీఎంసీ 6,26 వార్డుల్లో పర్యటనలో వైసీపీ జిల్లా నేత కేకే రాజు





**విశాఖపట్నం, సెప్టెంబర్ 15, జయ జయహే :**

విశాఖ నగరంలో గత కొన్ని నెలలుగా తీవ్రంగా నెలకొన్న తాగునీటి సమస్యను స్వయంగా పరిశీలించి, ప్రజల ఇబ్బందులను తెలుసుకునేందుకు విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె. రాజు నగరంలోని పలు వార్డుల్లో మంగళవారం పర్యటించారు. భీమిలి నియోజకవర్గంలోని 6వ వార్డు పీఎం పాలెం రెండవ బస్ స్టాప్, లక్ష్మీవాణిపాలెం గ్రామం, ఆర్.హెచ్. కాలనీతో పాటు.. విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 26వ వార్డు చిన్నూరు మసీదు ప్రాంతంలో ఆయన సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి, ఎన్ని రోజులుగా నీటి సమస్య ఉంది, ఎప్పుడు నీరు వస్తోంది, ఎంతసేపు సరఫరా అవుతోంది, సరఫరా అవుతున్న నీరు ఏ స్థితిలో ఉంది వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె. రాజు మాట్లాడుతూ నగర చరిత్రలో గతంలో ఎన్నడూ లేనంత తీవ్రంగా తాగునీటి సంక్షోభం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా నగరంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు కనీస అవసరాలకు కూడా నీరు దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు నీటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎప్పుడు నీరు వస్తుందో తెలియక, తమ రోజువారీ పనులు, ఉపాధి, పిల్లల చదువులు, ఇతర అవసరాలను సైతం పక్కనపెట్టి నీటి కోసం నిరీక్షించాల్సి వస్తోందని చెప్పారు. ముఖ్యంగా పేదలు, రోజువారీ కూలీలు, చిన్నచిన్న పనులు చేసుకునే కుటుంబాలు నీటి కొరతతో మరింత తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉదయం, మరికొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం, ఇంకొన్ని ప్రాంతాల్లో రాత్రి నీరు సరఫరా అవుతుండటంతో ప్రజలు తమ పనులను సైతం వదిలి నీటి కోసం ఇళ్ల వద్దే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. “ఒక బిందె నీటి కోసం ప్రజలు గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి విశాఖలో ఎప్పుడూ చూడలేదని, ప్రజల దాహార్తిని తీర్చాల్సిన ప్రభుత్వం సమస్యను పట్టించుకోకుండా వ్యవహరిస్తోంది. ఇది కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అసమర్థతకు నిదర్శనం” అని విమర్శించారు.

**నీటి కొరతను వ్యాపారంగా మార్చొద్దు....!**

ప్రస్తుత నీటి సంక్షోభాన్ని కొందరు ప్రైవేటు వాటర్ ట్యాంకర్ నిర్వాహకులు వ్యాపారంగా మార్చుకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో అధిక ధరలు వసూలు చేయడం సరికాదన్నారు. జీవీఎంసీ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. “ప్రజలకు నీరు అవసరమైన సమయంలో నీటిని అమ్ముకుని లాభాలు సంపాదించే పరిస్థితి రాకూడదు. జీవీఎంసీ తక్షణమే అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రభుత్వ ఆధ్వర్యంలో ట్యాంకర్లను ఏర్పాటు చేయాలి. ప్రజల దాహాన్ని తీర్చడం ప్రభుత్వ బాధ్యత” అని అన్నారు.

**పోలవరం నీరు ఎక్కడ..!**

విశాఖ నగరానికి పోలవరం నీటిని తీసుకోనివచ్చామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ప్రశ్నించారు. “ప్రకటనలు చేయడం, ప్రచారాలు నిర్వహించడం కాదు.. క్షేత్రస్థాయిలో ప్రజలకు నీరు అందుతున్నదా లేదా అనేది ప్రభుత్వం చూడాలి. పోలవరం నీరు వస్తుందని చెబుతున్న ప్రభుత్వం, ఈరోజు విశాఖ నగరంలోని అనేక ప్రాంతాల్లో ఒక బిందె నీటి కోసం ప్రజలు ఎందుకు గంటల తరబడి ఎదురు చూస్తున్నారో సమాధానం చెప్పాలని” అని ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ప్రచార కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి, మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని డిమాండ్ చేశారు.

**నాలుగురోజుల్లో తాగునీటి సమస్యని పరిషరించాలి.. !**

నగరవ్యాప్తంగా తాగునీటి సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావడంతో పాటు, తీవ్ర నీటి కొరత ఉన్న ప్రాంతాలకు తక్షణమే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. “నాలుగు రోజుల్లోగా విశాఖ నగర ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే, నీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలను కలుపుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం” అని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పోతిన హనుమంతు, పోతిన శ్రీనివాసు రావు,పోతిన ప్రసాద్,బొడ్డేటి కిరణ్,డోప్ప శ్రీను,జక్కపూడి సత్యనారాయణ, పార్టీ నాయకులు మారుతి ప్రసాద్,భోగవల్లి గోవింద్,పిల్లి సుజాత, రాజేశ్వరి, జగ్గుపల్లి నరేష్, అప్పన్న, రోషి రెడ్డి , నర్సింగరావు , మూర్తి బాబు, నాగభూషణ్, బొట్ట అప్పలరాజు, ఎల్లాజీ, పిల్లా రమణ,శేషు, అమ్మాజీ, నవాబ్, పోతున్న బంతి హరి,బొట్టా రాజు, తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ అభ్యర్థులకు గ్రూప్ 1 ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు పెంపు

## మైనారిటీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి

## మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపు

**అమరావతి,సెప్టెంబరు 15 (జయ జయహే )**



రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్-2026ను అనుసరించి గ్రూప్-× పరీక్షలకు పోటీపడే మైనారిటీ అభ్యర్థులను ఉచిత శిక్షణకు ఎంపిక కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష కు దరఖాస్తు గడువును మరోసారి పెంచినట్లు మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం ) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందేనని మంత్రి గుర్తు చేశారు. ఈనెల 10వ తేదీ వరకు నిర్దేశించిన గడువు ను 15 వ తేదీ వరకు పొడిగించిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. అయితే ఈ గడువును మరోసారి పెంచి ఈనెల 25వతేది వరకు దరఖాస్తు చేయడానికి పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఇప్పటివరకు దరఖాస్తు చేయని అర్హులైన మైనారిటీ అభ్యర్థులు ఈ అదనపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పొడిగించిన గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 సివిల్ పరీక్షకు హాజరుకావాలనుకునే మైనారిటీ అభ్యర్థులకు శ్రేష్ఠమైన శిక్షణ, మార్గదర్శకత్వం, సహకారాన్ని అందించడమే ఉచిత శిక్షణా కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.మరిన్ని వివరాల కోసం సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం),మైనారిటీ సంక్షేమ శాఖ,వెబ్‌సైట్: ష్ట్రజూం://ఝజూవెవఎఎషఎ.శీతీస్త్ర ఫోన్: 08645-297535 / 7386789966. సంప్రదించాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

# ఉద్యోగాల కల్పనను ఓర్వలేకే వైసీపీ దుష్ప్రచారం

## డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు నిరాధారం

## మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి, సెప్టెంబర్ 15, జయ జయహే**



డీఎస్సీ నియామకాలపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగ నియామకాలు చేపడుతుంటే వాటిని ఓర్వలేక వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు జరిగిన అన్యాయాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని మంత్రి అన్నారు. ఐదేళ్లపాటు ఉద్యోగాల భర్తీని నిర్లక్ష్యం చేసిన వారు ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తుంటే విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. స్పోర్ట్స్ కోటా నియామకాలపై కూడా నిబంధనల ప్రకారమే అర్హత, ప్రతిభ ఆధారంగా నియామక ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తోందన్నారు. క్రీడా రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తగిన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వైసీపీ నేతలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఉద్యోగాలు అమ్ముకున్నారని ఆరోపణలు చేస్తున్న వైసీపీ నేతలు ముందుగా తమ ప్రభుత్వ హయాంలో జరిగిన నియామకాలు, అవకతవకలపై ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత ప్రజలను రెచ్చగొట్టేందుకు నిరాధార ఆరోపణలు చేయడం వైసీపీ నేతలకు పరిపాటిగా మారిందని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు రావడం, నిరుద్యోగులకు భరోసా కల్పించడం వైసీపీకి ఇష్టం లేదని, అందుకే కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డీఎస్సీ నియామకాలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో ఫిర్యాదు చేయాలని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని మంత్రి సూచించారు. నిరుద్యోగ యువత ప్రయోజనాలను కాపాడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.



# వశిష్ట మహర్షి, సర్ ఆర్థర్ కాటన్ విగ్రహ దిమ్మెలను పరిశీలించిన మంత్రి దుర్గేష్

**రాజమహేంద్రవరం: జయ జయహే :సెప్టెంబర్ 16**

ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ (విజ్జేశ్వరం ఆర్మ్)పై దశాబ్దాలుగా ఒరిగిపోయి ప్రమాదకర స్థితిలో ఉన్న వశిష్ట మహర్షి విగ్రహ దిమ్మెను పూర్తిగా తొలగించి నూతనంగా పునర్నిర్మించారు. అలాగే సర్ ఆర్థర్ కాటన్ విగ్రహ దిమ్మెకు మరమ్మతు పనులు పూర్తి చేశారు.నిడదవోలు పర్యటనకు వెళ్తూ కాటన్ బ్యారేజ్ వద్ద ఆగిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పునర్నిర్మించిన రెండు విగ్రహ దిమ్మెలను స్వయంగా పరిశీలించారు. గోదావరి పవిత్రతకు ప్రతీక వశిష్ట మహర్షి, డెల్టా రూపురేఖలను మార్చిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ విగ్రహ దిమ్మెలను పునరుద్ధరించడం సంతోషకరమన్నారు. స్వల్ప కాలంలో నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేసిన జలవనరుల శాఖ అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు.

For a pure tomorrow.. జయహే



# యువతభవితపై రాజకీయాలొద్దు

## వైసిపి హయాంలో ఎపిపిఎస్సీ వ్యవహారాలపై సమాధానం చెప్పాలి: ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం జయ జయహే : సెప్టెంబర్ 15:**

యువత భవిష్యత్తుకు సంబంధించిన పోటీ పరీక్షలపై రాజకీయ దుష్ప్రచారం చేయడం సరికాదని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించామని, మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు కల్పించామని స్పష్టం చేశారు. మంగళవారం గౌతమి గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో నిర్వహించిన చిట్‌చాట్ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిఎస్సీ, ఎపిపిఎస్సీకి మధ్య తేడా తెలియని వారు కూడా పరీక్షలపై మాట్లాడుతున్నారని విమర్శించారు. డీఎస్సీపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు విద్యార్థుల్లో అనవసర భయాందోళనలు కలిగిస్తున్నాయని అన్నారు. వైసిపి హయాంలో ఎపిపిఎస్సీ వ్యవహారాలపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించిన ఎమ్మెల్యే, జవాబు పత్రాలను మూడుసార్లు ఎందుకు మూల్యాంకనం చేయాల్సి వచ్చిందని, 87 మంది అభ్యర్థుల మూల్యాంకన స్లిప్పుల్లో చీఫ్ ఎగ్జామినర్ సంతకాల విషయంలో దిద్దుబాట్లు ఎందుకు జరిగాయని నిలదీశారు. చైర్మన్ అనుమతి లేకుండా డిజిటల్ మూల్యాంకనం ఎందుకు చేపట్టారు? స్ట్రాంగ్ రూమ్‌లోని జవాబు పత్రాలను ప్రైవేట్ వ్యక్తులకు ఎందుకు అప్పగించారు? డిజిటల్, మాన్యువల్ మూల్యాంకనాల్లో మార్కుల తేడా ఎందుకు వచ్చిందో వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డిఎస్సీపై వైసిపి చేస్తున్న ఆరోపణలపై మంత్రి నారా లోకేష్ బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నారని ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. సమయం, స్థలం జగన్ నిర్ణయించినా చర్చకు సిద్ధమేనన్నారు. ఆధారాలతో వస్తే ప్రతి ఆరోపణకు సమాధానం చెబుతామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఇందుకు నిదర్శనమన్నారు. రాజకీయాలకు అతీతంగా గత ఎనిమిదేళ్లుగా నియోజకవర్గంలోని వినాయక చవితి మండపాలకు వ్యక్తిగతంగా సహకరిస్తున్నానని ఎమ్మెల్యే శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటివరకు వందకు పైగా మండపాలకు సహకరించానన్నారు. వినాయక ఉత్సవాల ద్వారా యువతలో ఐక్యత, క్రమశిక్షణ, పెద్దలను గౌరవించడం, సంప్రదాయాల పట్ల గౌరవం, ఆర్థిక నిర్వహణ వంటి మంచి లక్షణాలు పెంపొందుతున్నాయని తెలిపారు. యువతలో వస్తున్న చైతన్యం, మార్పు భవిష్యత్తులో వారికి ఉపయోగపడటమే తనకు కావాల్సిన సంతృప్తి అన్నారు. మీడియా సమావేశంలో టిడిపి నాయకులు కాశీ నవీన్ కుమార్, రెడ్డి మనేశ్వరరావు, బుడ్డిగ రవి, శెట్టి జగదీష్, మాటూరి సిద్ధు, ద్వారా పార్వతి సుందరి, కొల్లి బుజ్జి, తంగెళ్ళ బాబి , కరగాని వేణు తదితరులు పాల్గొన్నారు.

# రూపాయి పతనంతో కొనుగోలు శక్తికి సవాలు

**(హెచ్.ప్రతాప్)**



ఒక డాలర్ విలువ రూ.95కు చేరువ కావడం మార్కెట్ తెరపై కనిపించే ఒక సంఖ్య మాత్రమే కాదు. అది భారత ఆర్థిక వ్యవస్థకు ఎదురవుతున్న ఒక కీలక ప్రశ్నను ముందుకు తెస్తోంది---దేశం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోంది అన్నదానికంటే, ఆ వృద్ధిని విదేశీ చమురు, దిగుమతి ముడిసరుకు, విదేశీ మూలధనంపై ఎంత తక్కువ ఆధారపడేలా మార్చగలుగుతున్నాం? సెప్టెంబరు 8న రూపాయి డాలర్‌తో పోలిస్తే సుమారు రూ.94.82కు పడిపోయింది. అదే సమయంలో బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు దాదాపు 98 డాలర్లకు చేరింది. అంటే భారతదేశానికి ఒకేసారి చమురు ధర పెరుగుదల, రూపాయి బలహీనత అనే ద్వంద్వ ఒత్తిడి ఎదు-రవుతోంది.

ఈ పరిస్థితిని అర్థం చేసుకోవడానికి భారతదేశపు చమురు ఆధారితతను చూడాలి. 2025--26లో దేశ ముడిచమురు అవసరాల్లో 88.7 శాతం దిగుమతుల ద్వారానే తీరింది. 2024--25లో ఈ ఆధారితత 89.44 శాతంగా నమోదైంది. అంటే దేశీయ ఉత్పత్తి పెరుగుతున్నప్పటికీ, ఇంధన భద్రత విషయంలో భారత్ ఇంకా ప్రపంచ చమురు మార్కెట్‌కు బలంగా అనుసంధానమై ఉంది.

ఇక్కడే రూపాయి విలువ కీలకమవుతుంది. ఒక బ్యారెల్ చమురు ధర 100 డాలర్లు అనుకుందాం. డాలర్ రూ.85గా ఉంటే దాని రూపాయి వ్యయం రూ.8,500. డాలర్ రూ.95 అయితే అదే చమురు రూ.9,500. చమురు ధర పెరగకపోయినా కేవలం మారకపు విలువ మారడం వల్లే బ్యారెల్‌కు రూ.1,000 అదనపు వ్యయం. చమురు ధర కూడా పెరిగితే ప్రభావం మరింత తీవ్రమవుతుంది. అందుకే రూపాయి బలహీనతను కేవలం విదేశీ మారక మార్కెట్ సమస్యగా చూడటం తప్పు.

దీని ప్రభావం పెట్రోలు బంకు వద్ద ముగియదు. చమురు రవాణాకు, విద్యుత్ ఉత్పత్తికి, పరిశ్రమలకు, వ్యవసాయ కార్యకలాపాలకు కీలకమైన ఇంధన ఆధారం. ఇంధన వ్యయం పెరిగితే సరకు రవాణా ఖర్చు పెరుగుతుంది; రవాణా ఖర్చు పెరిగితే ఆహారం, వినియోగ వస్తువులు, పారిశ్రామిక ఉత్పత్తుల ధరలపై ఒత్తిడి వస్తుంది. అయితే ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి: రూపాయి బలహీనపడిన ప్రతిసారీ ద్రవ్యోల్బణం అదే స్థాయిలో పెరగదు. దేశీయ డిమాండ్, అంతర్జాతీయ వస్తువుల ధరలు, సంస్థల లాభ మార్జిన్లు, ప్రభుత్వం తీసుకునే ధరల చర్యలు వంటి అంశాలు మధ్యవర్తిత్వం చేస్తాయి. ప్రస్తుతం జూలైలో వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం 4.45 శాతంగా ఉంది; ఇది భారతీయ రిజర్వు బ్యాంకు 4 శాతం లక్ష్యానికి పైనే ఉంది.

భారతదేశపు బాహ్య వాణిజ్య గణాంకాలు సమస్య పరిమాణాన్ని మరింత స్పష్టంగా చూపుతున్నాయి. 2025--26లో వస్తు ఎగుమతులు 441.78 బిలియన్ డాలర్లు కాగా, దిగుమతులు 774.98 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫలితంగా వస్తు వాణిజ్య లోటు 333.19 బిలియన్ డాలర్లుగా నమోదైంది---మునుపటి ఏడాదితో పోలిస్తే 283.50 బిలియన్ డాలర్ల నుంచి గణనీయంగా పెరిగింది. అంటే రూపాయి బలహీనత వెనుక కేవలం ఊహాగానాలు లేవు; భారతదేశపు దిగుమతి--ఎగుమతి నిర్మాణంలో ఉన్న అసమతుల్యత కూడా ఉంది.

అయితే బలహీన రూపాయికి ఒక ప్రయోజన పార్శ్వం కూడా ఉంది. ఎగుమతిదారులకు విదేశీ కరెన్సీలో వచ్చే ఆదాయం రూపాయల్లో ఎక్కువగా మారుతుంది. కానీ దిగుమతి ముడిసరుకు, యంత్రాలు లేదా ఇంధనంపై ఆధారపడే సంస్థలకు వ్యయం కూడా అదే స్థాయిలో పెరుగుతుంది. కాబట్టి కరెన్సీని బలహీనపరచడం ద్వారా ఎగుమతులను పెంచే వ్యూహం మాత్రమే సరిపోదు. నిజమైన పోటీతత్వం తక్కువ ఉత్పత్తి వ్యయం, అధిక ఉత్పాదకత, నాణ్యత, సాంకేతిక సామర్థ్యం, వేగవంతమైన సరఫరా వ్యవస్థల నుంచి రావాలి.

విదేశీ విద్యను ఎంచుకునే కుటుంబాలకు ఈ మార్పు మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఒక విద్యార్థికి సంవత్సరానికి 50,000 డాలర్ల ఖర్చు ఉంటే, డాలర్ రూ.85 వద్ద మొత్తం రూ.42.5 లక్షలు; రూ.95 వద్ద రూ.47.5 లక్షలు. కేవలం మారకపు విలువ వల్లే రూ.5 లక్షల అదనపు భారం. 2024--25లో భారతీయులు విదేశీ విద్య కోసం సుమారు 2.92 బిలియన్ డాలర్లు పంపించారు. ఇది 2021--22లో నమోదైన 5.17 బిలియన్ డాలర్ల గరిష్ఠం కంటే తక్కువైనా, రూపాయి బలహీనత ఉన్నప్పుడు ప్రతి కుటుంబం చెల్లించే రూపాయి వ్యయం పెరుగుతుంది.

అయితే భారతదేశం వద్ద ఒక ముఖ్యమైన రక్షణ కవచం ఉంది. ఆగస్టు 28, 2026 నాటికి విదేశీ మారక నిల్వలు 740.80 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరాయి. అందులో విదేశీ కరెన్సీ ఆస్తులు 600.67 బిలియన్ డాలర్లు, బంగారం 116.41 బిలియన్ డాలర్లు. జూన్ నుంచి చేపట్టిన ప్రత్యేక చర్యల ద్వారా విదేశీ కరెన్సీ ప్రవాహాలు 136 బిలియన్ డాలర్లకు పైగా సమీకరించబడ్డాయి. ఈ నిల్వలు రూపాయిపై ఆకస్మిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు భారతీయ రిజర్వు బ్యాంకుకు గణనీయమైన సామర్థ్యాన్ని ఇస్తున్నాయి.

కానీ ఇక్కడ ఒక కీలకమైన తేడాను గుర్తించాలి. విదేశీ మారక నిల్వలు రూపాయిని రక్షించగలవు; రూపాయి బలానికి శాశ్వత కారణం కాలేవు. నిల్వలను ఉపయోగించి మార్కెట్‌లో అధిక అస్థిరతను తగ్గించవచ్చు. కానీ చమురు దిగుమతి ఆధారితతను అవి తొలగించలేవు. వాణిజ్య లోటును అవి శాశ్వతంగా పరిష్కరించలేవు. తక్కువ విలువ జోడింపు కలిగిన ఎగుమతుల సమస్యను అవి సరిచేయలేవు.

అందుకే పరిష్కారం స్పష్టంగా ఉండాలి. చమురు దిగుమతి ఆధారితతను క్రమంగా తగ్గించాలి; పునరుత్పాదక ఇంధనాన్ని, విద్యుదీకరణను వేగవంతం చేయాలి; అధిక దిగుమతి ఆధారిత తయారీ రంగాల్లో దేశీయ విలువ జోడింపును పెంచాలి; ఎగుమతులను మరింత విస్తృత దేశాలు, ఉత్పత్తులకు విస్తరించాలి; చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మారకపు విలువ మార్పుల నుంచి రక్షణ కల్పించే ఆర్థిక సాధనాలను అందుబాటులోకి తేవాలి.

రూపాయి రూ.95 వద్ద ఉందా, రూ.94 వద్ద ఉందా అన్నది తాత్కాలిక మార్కెట్ ప్రశ్న. అసలు ప్రశ్న భారత ఆర్థిక వ్యవస్థ డాలర్‌ను సంపాదించే సామర్థ్యాన్ని ఎంత వేగంగా పెంచుకుంటోంది, డాలర్‌ను ఖర్చు చేసే అవసరాన్ని ఎంత వేగంగా తగ్గించుకుంటోంది అన్నదే. విదేశీ మారక నిల్వలు రికార్డు స్థాయిలో ఉన్నప్పటికీ రూపాయిపై ఒత్తిడి కొనసాగుతుండటం ఈ వ్యత్యాసాన్ని స్పష్టంగా చూపుతోంది.

కాబట్టి రూపాయిని ఒక నిర్దిష్ట సంఖ్య వద్ద నిలబెట్టడం లక్ష్యం కాకూడదు. భారతీయుడి కొనుగోలు శక్తిని స్థిరంగా ఉంచడం, దిగుమతి ఆధారితతను తగ్గించడం, ఎగుమతి సామర్థ్యాన్ని పెంచడం, ఉత్పాదకతను మెరుగుపరచడం---ఇవే నిజమైన లక్ష్యాలు కావాలి. బలమైన రూపాయి విదేశీ మారక మార్కెట్‌లో జోక్యంతో మాత్రమే పుట్టదు; బలమైన ఉత్పత్తి, బలమైన ఎగుమతులు, తక్కువ దిగుమతి ఆధారితత, అధిక ఉత్పాదకత నుంచి పుడుతుంది. డాలర్ రూ.95 అనేది భయపడాల్సిన సంఖ్య కాదు---మన ఆర్థిక నిర్మాణాన్ని మరింత బలపరచాల్సిన హెచ్చరిక.

# భారత్ నాయకత్వంలో బ్రిక్స్‌కు కొత్త దిశ

**(హెచ్.ప్రతాప్)**



ప్రపంచం భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య అస్థిరత, ఇంధన భద్రత సవాళ్లు, సరఫరా గొలుసుల అంతరాయాలు, సాంకేతిక పరివర్తన వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబరు 12, 13 తేదీల్లో భారత్ ఆతిథ్యమిస్తున్న ఈ సమావేశం కేవలం దేశాధినేతల భేటీ కాదు; మారుతున్న ప్రపంచ వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాల పాత్రను పునర్నిర్వచించే అవకాశం.

2026 జనవరి నుంచి బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన భారత్ "స్థితిస్థాపకత, నవకల్పన, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే ఇతివృత్తాన్ని ముందుకు తెచ్చింది. ప్రజాకేంద్రిత, "మానవత్వమే ప్రథమం" అనే దృక్పథంతో సహకారాన్ని ఆచరణాత్మక ఫలితాల దిశగా తీసుకెళ్లడం భారత్ ముందున్న ప్రధాన లక్ష్యం. ప్రపంచ పాలనా వ్యవస్థలో సంస్కరణలు, వాణిజ్యం--పెట్టుబడులు, ఆహార--ఇంధన భద్రత, ఆరోగ్యం, వాతావరణ మార్పు, సాంకేతికత, కృత్రిమ మేధ, డిజిటల్ మౌలిక వసతులు, సరఫరా గొలుసుల స్థిరత్వం వంటి అంశాలు చర్చల్లో కీలకంగా నిలిచే అవకాశం ఉంది.

బ్రిక్స్ బలం దాని విస్తృత ప్రాతినిధ్యంలో ఉంది. అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పాటు ఆసియా, ఆఫ్రికా, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా ప్రాంతాలకు చెందిన దేశాలు ఇందులో భాగస్వాములయ్యాయి. అందువల్ల ఆహార భద్రత, వాతావరణ ఆర్థిక సహాయం, ఆరోగ్య సమానత్వం, అభివృద్ధి చెందుతున్న దేశాల రుణభారం వంటి అంశాలపై ప్రపంచ దక్షిణ దేశాల స్వరం మరింత బలంగా వినిపించవచ్చు.

భారత్‌కు బ్రిక్స్ మరో ముఖ్యమైన ప్రయోజనం వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి. పాశ్చాత్య కూటములకు దూరంగా ఉండటం లేదా ఏదైనా ఒక శక్తికేంద్రానికి దగ్గరవడం కాకుండా, దేశ ప్రయోజనాల ఆధారంగా విభిన్న దేశాలతో సమతుల్య సంబంధాలను కొనసాగించే భారత విధానానికి బ్రిక్స్ ఒక కీలక వేదిక. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్‌కు కూడా బ్రిక్స్ సమష్టి బలం ఇస్తుంది.

ఆర్థిక రంగంలోనూ అవకాశాలు విస్తృతం. నూతన అభివృద్ధి బ్యాంకు ద్వారా మౌలిక వసతులు, సుస్థిర అభివృద్ధికి దీర్ఘకాలిక నిధులు సమకూర్చుకోవచ్చు. స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం, సరిహద్దు డిజిటల్ చెల్లింపులు, పరస్పర కరెన్సీ మార్పిడి వంటి విధానాలపై పురోగతి సాధిస్తే డాలర్‌పై అధిక ఆధారపడటాన్ని తగ్గించి అంతర్జాతీయ ఆర్థిక ఒడిదుడుకుల ప్రభావాన్ని కొంతమేర నియంత్రించవచ్చు. అదే సమయంలో ఔషధాలు, డిజిటల్ సేవలు, వాహనాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, వస్త్రాలు, పునరుత్పాదక ఇంధన పరికరాలకు కొత్త మార్కెట్లు తెరుచుకోవచ్చు. సాంకేతిక రంగం భారత్‌కు ప్రత్యేక అవకాశం. ఆధార్, యూపీఐ, డిజిటల్ ప్రజా మౌలిక వసతుల వంటి భారత అనుభవాన్ని ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకోవడం ద్వారా సమ్మిళిత డిజిటల్ అభివృద్ధికి కొత్త నమూనాను రూపొందించవచ్చు. కృత్రిమ మేధ, ఆరోగ్య సాంకేతికత, అంతరిక్ష పరిశోధన, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాల్లో సంయుక్త పరిశోధనలకు కూడా మార్గం సుగమమవుతుంది. అయితే బ్రిక్స్ ముందు సవాళ్లు కూడా ఉన్నాయి. సభ్యదేశాల రాజకీయ వ్యవస్థలు, ఆర్థిక ప్రయోజనాలు, విదేశాంగ విధానాలు భిన్నంగా ఉండటంతో ఏకాభిప్రాయం సాధించడం అంత సులభం కాదు. ముఖ్యంగా చైనా ఆర్థిక ఆధిపత్యం, భారత్‌కు ఉన్న భారీ వాణిజ్య లోటు వంటి అంశాలను విస్మరించలేం. ప్రకటనలకు మించి కార్యాచరణలోకి వెళ్లడమే అసలు పరీక్ష. అందుకే ఢిల్లీ సమావేశం ప్రకటనల వేదికగా కాకుండా కార్యాచరణకు నాందిగా మారాలి. ప్రతి నిర్ణయానికి గడువు, బాధ్యత వహించే సంస్థ, పెట్టుబడి, కొలిచే ఫలితాలను నిర్దేశించే విధానం అవసరం. బ్రిక్స్‌ను ఏ ఒక్క దేశానికి అనుకూలమైన లేదా పాశ్చాత్య ప్రపంచానికి వ్యతిరేకమైన కూటమిగా కాకుండా, విభిన్న దేశాల మధ్య సహకారానికి వంతెనగా భారత్ తీర్చిదిద్దాలి.

ప్రపంచం ఇప్పుడు ఆధిపత్యం కంటే భాగస్వామ్యాన్ని, ఘర్షణ కంటే సంభాషణను కోరుకుంటోంది. న్యూఢిల్లీ నుంచి సమానత్వం, సహకారం, సుస్థిర అభివృద్ధి, మానవ సంక్షేమం అనే సందేశం బలంగా వినిపిస్తే, ఈ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం భారత్‌కు వ్యూహాత్మక విజయమే కాకుండా ప్రపంచ దక్షిణ దేశాలకు కొత్త ఆశాకిరణంగా నిలుస్తుంది.



# 7వ వార్డులో ఘనంగా ప్రారంభమైన 12వ వార్షిక వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు పట్టణంలోని 7వ వార్డు శ్రీ చెన్నాపురపు భాస్కర్‌రావు గారి వీధిలో ఫ్రెండ్స్ కమిటీ ఆధ్వర్యంలో 12వ వార్షిక వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది ఉత్సవాల కోసం వీరపురెడ్డి వెంకటేష్ (జీకే) గారు స్వామివారి విగ్రహాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించడంతో పాటు, నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వినాయక చవితి సందర్భంగా వీధిని విద్యుత్ దీపాలు, పూల అలంకరణలతో అందంగా ముస్తాబు చేశారు. తొలిరోజు నుంచే స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. 12 రోజుల పాటు నిర్వహించనున్న ఈ నవరాత్రి మహోత్సవాల్లో భక్తుల కోసం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఫ్రెండ్స్ కమిటీ సభ్యులు వెల్లడించారు. స్థానిక ప్రజలు, యువత, మహిళలు ఉత్సవాల్లో చురుగ్గా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

# నిడదవోలు ఎస్‌వీడీ కళాశాలలో రూ.5 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి

## ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతాం: మంత్రి దుర్గేష్





**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.నిడదవోలు పట్టణంలోని ఎస్.వి.డి. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పీఎం--ఉషా పథకం కింద రూ.3.60 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాన్ని మంగళవారం మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలోని సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.మంత్రి మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధికి పీఎం--ఉషా పథకం ద్వారా మొత్తం రూ.5 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. రూ.3.60 కోట్లతో భవన నిర్మాణం చేపట్టగా, మిగిలిన రూ.1.40 కోట్లతో సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ ల్యాబ్‌తో పాటు బాలికల కోసం 18 ఆధునిక మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ నిధుల్లో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటా అందిస్తున్నాయని తెలిపారు.విద్యార్థినులు సంప్రదాయ విద్యతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంతాల విద్యార్థులకు కూడా ఆధునిక సాంకేతిక విద్య అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. విద్యతో పాటు పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.కార్యక్రమంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థినిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. చదువుతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికితీసినప్పుడే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదిగిన విద్యార్థినులు తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని మంత్రి కోరారు.



## కొయ్యూరు శివాలయం చెక్ డ్యామ్ మరమ్మతుల్లో అవకతవకలు..

### ఇంజనీరింగ్ అధికారిపై ఎంపీడీఓకు రైతుల ఫిర్యాదు

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 16,**

అల్లూరి జిల్లా కొయ్యూరు శివాలయం వద్ద ఉన్న చెక్ డ్యామ్ మరమ్మతు పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు మార్చుకున్న ఇంజనీరింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని రైతులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు.చెక్ డ్యామ్ మరమ్మతు పనులు చేయకపోవడం వల్ల వర్షపు నీరు ఎక్కువ శాతం మెయిన్ కాలువలోకి వెళ్లిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కుడి, ఎడమ కాలువ మరమ్మతు పనులకు 16 లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలుస్తోంది. బస్తా సిమెంటు, తట్ట మట్టి పనులు కూడా జరగకుండానే బిల్లులు మార్చుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.ఈ కార్యక్రమం లో ఆదివాసీ జెఏసి అధ్యక్షులు ఎస్. అశోక్ లాల్, వైసీపీ నాయకులు నర్సి కృష్ణ, మండల బిజెపి మోర్చా అధ్యక్షులు గాలి దేవుడు, కించె చిన్నయ్య పడాల్, నీటి సంఘం చైర్మన్ కించె రాజు పడాల్, మొట్టడం అబ్బాయి దొర, దిబ్బ రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాల్లో డీజేలకు నిషేధం...

### సీఐ శ్రీనివాసరావు

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 16**

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండల వ్యాప్తంగా డీజేలకు నిషేధం విధించినట్లు కొయ్యూరు సీఐ బి. శ్రీనివాసరావు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, శబ్ద కాలుష్య నివారణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించి డీజేలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక మండపాల వద్ద సాంప్రదాయ వాయిద్యాలకే అనుమతి ఉంటుందని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించరాదని సూచించారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ శ్రీనివాసరావు కోరారు.

## ఓటర్లజాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం

**మునగపాక సెప్టెంబర్ 15 జయ జయహే,**

త్వరలో జరగనున్న ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ తుది జాబితా తయారు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలు అభ్యంతరాలు తెలుసుకోవడానికి బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో తమ్మిరెడ్డి ప్రసాద్ కుమార్ తెలిపారు మండలంలోని 26 గ్రామపంచాయతీలు పరిధిలో 16 ఎంపీటీసీలు స్థానాలకు 86 పోలింగ్ స్టేషన్ ద్వారా జరిగే ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయాలు అభ్యంతరాలు తెలుసుకోవడం కోసం ఈ ప్రత్యేక సమావేశం ఎన్నికల అధికారులు ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో ప్రసాద్ కుమార్ తెలిపారు బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి గుర్తింపు పొందిన అన్ని పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు

## 18 నుంచి కైలాసగిరి రోప్‌వే సేవలు

**విశాఖపట్నం (జయ జయహే)**

పర్యాటక ప్రాంతమైన కైలాసగిరి కొండ వద్ద పర్యాటకులకు సేవలందించే రోప్ వే ఈ నెల 18 నుంచి పనిచేస్తుందని వీఎంఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ప్రతీ నెలా రోప్ వే నిర్వహణ చేపడుతుంటారు. ఇందులో భాగంగానే తొలుత ఈ నెల 9 ఉంచి 16 వరకు నిర్వహణ నిమిత్తం నిలిపివేశారు. అయితే రానున్న రోజుల్లో పర్యాటకుల సంఖ్యమరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా మెరుగైన పనితీరును కనపరిచేందుకు వీలుగా నిర్వాహకుల విన్నపం మేరకు మరో రెండు రోజుల (ఈ నెల 16, 17) పాటు పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టనున్నారు. అందువల్ల ఈ నెల 17 వరకు రోప్‌వే సేవలు నిలిపివేయగా, ఈ నెల 18 (శుక్రవారం) నుంచి యథావిధిగా రోప్ వే పని చేస్తుందని, ఈ విషయాన్ని పర్యాటకులు, సందర్శకులు దయ తో గమనించాలని కోరారు.



## సమాజానికి సాంకేతిక పరిజ్ఞానం అవసరం

### విద్యార్థులకు అంకితభావం క్రమశిక్షణ దూర దృష్టి ఉండాలి

### ఏపీ సచివాలయ సాంకేతిక అధికారి బత్తుల వెంకటస్వామి

**టెక్కలి సెప్టెంబర్ 15 జయ జయహే**

అభివృద్ధి చెందుతున్న సమాజానికి సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని ఇంజనీర్స్ దినోత్సవం సందర్భంగా ఐతం కళాశాల లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య ను స్మరించుకుంటూ ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తూ కళాశాల విద్యార్థులకు ఏపీ విజిలెన్స్ కమిషన్ , సచివాలయం ముఖ్య సాంకేతిక అధికారి బత్తుల వెంకటస్వామి, విశ్రాంతి చీఫ్ ఇంజనీర్ గిరిధర్ తో కలిసి తమ అమూల్య సూచనలు తెలియజేశారు. భారతదేశ ఆధునిక ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు, విద్యార్థులు క్రమశిక్షణ అంకితభావం , దేశ ప్రగతికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానశీ దూరదృష్టి తో అలవర్చుకోవాలని ఆయన సూచించారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ సంబంధిత సాంకేతిక విభాగాల్లో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నాయని వెంకటస్వామి తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో సృజనాత్మకత పరిశోధన దృక్పథాన్ని పెంపొందించేందుకు కళాశాలలో చక్కని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దేశాభివృద్ధికి తోడ్పడే ఇటువంటి ఆవిష్కరణలు ఎంతో అవసరమని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమ కన్వీనర్ డాక్టర్, పి దినకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ గిరిధర్, డీన్లు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



## పాడి రైతులకు అండగా నిలుస్తున్న హెరిటేజ్ డైరీ

**అచ్యుతాపురం, సెప్టెంబర్ 15, జయ జయహే:**

అచ్యుతాపురం మండలం మడుతూరు గ్రామంలో హెరిటేజ్ డైరీకి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతు నూను అప్పారావు ఆవు కొన్ని రోజులు కిందట మరణించినది. హెరిటేజ్ డైరీ మేనేజర్ కూంద్రపుశేషు ఆ రైతుకి 70 వేలు నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డైరీలో పాలు సరఫరా చేస్తున్న ప్రతి పాడి రైతుకు కృత్రిమ గర్భధారణ రాయితీ పైన రూపాయలు 50/లకే చెయ్యబడును అని, అదేవిధంగా కృత్రిమ గర్భధారణ రాయితీ పైన 500 రూపాయలకు చెయ్యబడును అని తెలిపారు. మాజీ పాల సంఘం అధ్యక్షుడు, టిడిపి సీనియర్ నాయకుడు శనివాడ ఆనంద్ రావు మాట్లాడుతూ హెరిటేజ్ డైరీ అన్ని డైరీలు కంటే ఎక్కువ రేటు చెల్లిస్తుందని తెలిపారు. అంతేకాకుండా హెరిటేజ్ డైరీ రైతు కష్టాల్లో ఆదుకుంటుందని ఎస్.ఆనందరావు ఆనందాన్ని వ్యక్తం చేశారు. సభ్యత్వం ఉన్న పాడిరైతుకు యాక్సిడెంట్లో మరణించినట్లయితే రెండు లక్షల రూపాయలు ఇస్తారని, అదే విధంగా సంవత్సరానికి రెండుసార్లు బోనస్, పాలుపోసిన పాడిరైతుకి ఇవ్వబడును అని అన్నారు. ఈ కార్యక్రమంలో నీరుకుండ పార్వతీ, బలిరెడ్డి శ్రీను, దోసూరు దుర్గారావు, ఎస్.శివ కృష్ణ, సంతోష్, లక్ష్మణరావు, ఈశ్వర్ రావు, నూకాలమ్మ మొదలైన పాడి రైతులు పాల్గొన్నారు.



## డొక్కా సీతమ్మ, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతుల సందర్భంగా అన్నదానం...

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య, డొక్కా సీతమ్మ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నిడదవోలు పట్టణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కీర్తిశేషులు, నిడదవోలు పట్టణ టీడీపీ సీనియర్ నాయకులు, 15వ వార్డు మాజీ అధ్యక్షులు కేదారిశెట్టి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కేదారిశెట్టి రవికుమార్, సునీత దంపతుల ఆర్థిక సహాయంతో అన్నా క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని నిడదవోలు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుపతి సత్యనారాయణతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ వెలగన శ్రీ దుర్గా అనంతలక్ష్మి ఫాతిమా, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ముంతాజ్ బేగం, ఏఎంసీ డైరెక్టర్ దేవేళ్ల సత్యశైలజ, బైపే రాజేశ్వరరావు, బండి వేణుగోపాలకృష్ణ, షేక్ అబ్దుల్ అజీజ్ భాషా, బేతిన విజయ్ ప్రసాద్, బొల్లా శ్రీనివాస్ గౌడ్, ఎండి షాజహాన్, చెట్టే సాల్మన్ రాజు, ఆకుతోట సతీష్ కుమార్, దేవళ్ల శ్రీనివాస్, ఎస్కే కరీం, అస్మత్ వినోద్, కొమ్మోజు రామకృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రైవేట్ స్కూళ్లపై కుల సంఘాల పేరుతో డబ్బుల వసూళ్లకు

### మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసిన ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు పట్టణ, మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలపై వివిధ కుల సంఘాల పేరుతో వచ్చి డబ్బులు అడుగుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పాఠశాలల కరస్పాండెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై నేడు నిడదవోలులోని బాల భారతి స్కూల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.సమావేశంలో కరస్పాండెంట్లు మాట్లాడుతూ.. కుల సంఘాల పేరుతో కొందరు పాఠశాలలకు వచ్చి డబ్బులు అడుగుతున్నారని, దీనివల్ల ప్రైవేట్ విద్యాసంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అనంతరం రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ను కలిసి సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో నిడదవోలు పట్టణ, మండల పరిధిలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.



## కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

### వేద పండితుల వసతులకు తగిన చర్యలు: మంత్రి కందుల దుర్గేష్....

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

టీటీడీ నిర్వహించిన పరీక్షల్లో ఎంపికైన నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు చెందిన 10 మంది వేద పండితులకు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ నిడదవోలు క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పండితులు మంత్రికి వేదాశీర్వచనం అందించి ఘనంగా సత్కరించారు.టీటీడీ వేద పారాయణ స్కీమ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 741 మంది వేద పండితులను ఎంపిక చేయడం అభినందనీయమని పండితులు పేర్కొన్నారు. పురోహితులు, అర్చకులు, దేవాలయ వ్యవస్థల పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.2027 జూన్ 26 నుంచి ప్రారంభమయ్యే గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ఉండ్రాజవరం మండలం తీపర్రు వద్ద పుష్కర ఘాట్ల ఏర్పాటుపై పండితులు హర్షం వ్యక్తం చేశారు.పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, నిడదవోలు పరిసర ప్రాంతాల్లోని 80 గ్రామాల పురోహితులకు వసతి, ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో ప్రజాసేవ చేయాలి

## విశ్వేశ్వరయ్య విగ్రహావిష్కరణలో సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

**విశాఖపట్నం, సెప్టెంబర్ 15, జయ జయహే**

భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం సాంకేతిక ప్రతిభకు, నిస్వార్థ ప్రజాసేవకు నిదర్శనమని, ఆయన ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని విద్యుత్ రంగంలో అత్యుత్తమ సేవలు అందించాలని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి పిలుపునిచ్చారు. ఇంజనీర్స్ డే సందర్భంగా మంగళవారం ఏపీఎసఈబి ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశ్వేశ్వరయ్య జీవితం నుంచి సాంకేతిక నైపుణ్యంతో పాటు దానిని ప్రజాసేవకు ఎలా సమర్థవంతంగా వినియోగించాలనే విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలన్నారు. సాంకేతిక సంస్థగా ప్రజల ప్రయోజనాలే ధ్యేయంగా పనిచేస్తున్న విద్యుత్ పంపిణీ సంస్థకు ఈ రెండు సూత్రాలు అత్యంత ముఖ్యమైనవని పేర్కొన్నారు. ఒక సబ్‌స్టేషన్ నిర్మించినా లేదా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినా అత్యుత్తమ సాంకేతిక ప్రమాణాలతో, నిరంతరం ప్రజలకు మేలు చేకూరేలా చేపట్టినప్పుడే ఈ విగ్రహావిష్కరణకు నిజమైన సార్థకత చేకూరుతుందని తెలిపారు. "పారిశ్రామికీకరణ లేదా పతనం" అన్న విశ్వేశ్వరయ్య నినాదం నేటి 'ఆత్మనిర్భర్ భారత', 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యాలకు సరిగ్గా సరిపోతుందన్నారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయం, పరిశ్రమలు మరియు గృహ అవసరాలకు వెన్నెముకగా నిలుస్తున్న విద్యుత్ రంగం




మరింత క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉందని అన్నారు. ఆధునిక కాలంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ సంస్థను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి ఇంజనీర్లు, ఉద్యోగులు పునరంకితం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఆపరేషన్స్ డైరెక్టర్ టి. వి. సూర్యప్రకాష్ మాట్లాడుతూ, విశ్వేశ్వరయ్య నిజాయితీ, కష్టపడే తత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతికతలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రాజెక్ట్సు డైరెక్టర్ టి. వనజ మాట్లాడుతూ, ఇంజనీరింగ్ అనేది కేవలం వృత్తి మాత్రమే కాదని, అది మానవాళికి చేసే సేవ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎసఈబి ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎన్. శామ్యూల్, కె. వెంకటరామారావు, కె. నాగప్రసాద్, ఎస్. వి. హేమంత్ కుమార్, సి. హెచ్. కోటేశ్వరరావు, ఎస్. వి. ఎస్. రామమూర్తి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. వి. రామకృష్ణప్రసాద్, సీజీఎంలు డి. సుమన్ కళ్యాణి, వి. విజయలలిత, బి. అశోక్ కుమార్, ఎస్. రాజబాబు, ఎల్. మహేంద్రనాథ్, పి. సోల్మన్ రాజు, పి. వెంకటేశ్వరరావు, అసోసియేషన్ల నాయకులు పోలాకి శ్రీనివాసరావు, కె. గణపతి, ఎస్. రామకృష్ణ, జి. ఎన్. ఎస్. పట్నాయక్, కె. టి. భాస్కర్, తదితరులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య కు ఘనంగా నివాళులర్పించారు.

# ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా విడుదల



**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 16**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలానికి సంబంధించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా నేడు విడుదలైంది.

ఈ జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో ప్రచురించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాల వివరాలు ఇందులో ఉన్నాయి.

ఈ ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులకు తెలియజేయాలని అధికారులు కోరారు.

# విజయవాడలో బి ఎస్ పి పార్టీ రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం విజయవంతం

**అరకులోయ: సెప్టెంబర్ 15, జయ జయహే**

బహుజన్ సమాజ్ పార్టీ స్థానిక ఎన్నికలకు బలోపేతానికి రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం విజయవాడ లో వివిధ జిల్లాల అధ్యక్షులు ఈ సందర్భంగా పాల్గొన్నారు,ఈ సమావేశం బి ఎస్ పి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ అధ్యక్షతన లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలోఉత్తరాంధ్ర జోన్ బి.ఎస్.పి పార్టీ చీఫ్ ఇంచార్జ్ కె తిరుపతిరావు పాల్గొన్నారు, ఈ సమావేశానికి అల్లూరి జిల్లా అధ్యక్షుడు శెట్టి లక్ష్మీనారాయణ హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరి జిల్లా పరిధిలో అన్ని స్థానాలలో జడ్పిటిసి ఎంపీటీసీ సర్పంచులు అభ్యర్థులు బి.ఎస్.పి పార్టీ తరపున పోటీ చేస్తుంది అని చెప్పారు, ఏ ఇతర పార్టీలతో మాకు పొత్తు ఉండదాన్ని తెలిపారు, అల్లూరి జిల్లాలో అన్ని స్థానాలు బి ఎస్ పి పార్టీ గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు,






# అభివృద్ధి పనులకు స్పీడ్ పెంచాలి!

## పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపాలి : ఎమ్మెల్సీ సోము వీర్రాజు

**రాజమహేంద్రవరం: జయ జయహే**

సెప్టెంబర్ 16: నగరంలోని ప్రజా సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి నగరంలోని పలు సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ కూరగంటి సతీష్ పాల్గొన్నారు. తారకరామ నగర్ పార్క్‌లోని వాటర్ ట్యాంక్ తొలగించి పార్కును అభివృద్ధి చేయడం, తారకరామ నగర్ నుంచి హైవే వరకు డ్రైనేజీ ఏర్పాటు అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. డ్రైనేజీ పనులకు సంబంధించిన డి పి ఆర్ , పరిపాలనా అనుమతులు, టెండర్ ప్రక్రియ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే 10వ వార్డులో పార్క్ అభివృద్ధి, గాడలమ్మ నగర్‌లో రోడ్ల అభివృద్ధి, మరమ్మతులు చేపట్టే అంశాలపై ఇప్పటికే సమర్పించిన వినతులపై తీసుకున్న చర్యలు, శాంక్షన్, నిధుల లభ్యత, పనుల ప్రారంభంపై వివరాలు కోరారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు మెరుగుపడేలా అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు కోరారు.

# ఈపీడీసీఎల్ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన సింహాచలం నాయుడు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 15, జయ జయహే**

ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) విశాఖ సర్కిల్ సూపరింటెండెంగ్ ఇంజనీర్‌గా బోను సింహాచలం నాయుడు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్కిల్‌లోని దాదాపు ఉద్యోగలంతా పెద్ద ఎత్తున తరలి వచ్చి పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు. తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఈపీడీసీఎల్ డిస్కం ప్రెసిడెంట్ బీఎం నాయుడు ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఎస్ ఈ నాయుడును మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిస్కం ప్రెసిడెంట్ బీఎం నాయుడు మాట్లాడుతూ మీ సమర్థవంతమైన పరిపాలనా నేతృత్వంలో విశాఖపట్నం సర్కిల్ పరిధిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ తరఫున ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర





కార్యవర్గ సభ్యులు, విశాఖపట్నం రీజినల్ కార్యదర్శి వేదుల నగేష్, రీజినల్ అధ్యక్షుడు ఆర్.ఆర్.మూర్తి, రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి. రామకృష్ణ, సీనియర్ నాయకులు ఇజ్జ మధుసూదన్, కె. నాయుడు బాబు, గవర వెంకట రావు, రీజినల్ కార్యవర్గ సభ్యులు వి.వి.ఎస్.ఎస్.డి. ప్రసాద్, కిలాని సురేష్ తదితరులు పాల్గొన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయానికి వెళ్లి సీఎండీ పృథ్వీతేజ్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు.




# పెన్షన్ల గడువు పెంచాలి!

ధవళేశ్వరం: పెన్షన్ల దరఖాస్తు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించాలనివైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా వికలాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ధవళేశ్వరంలోని తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో అధికారికి వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పెన్షన్ల దరఖాస్తుకు తక్కువ సమయం ఇవ్వడంతో పలువురు లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఆలస్యం, వరుస సెలవులు, సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడం వంటి కారణాలతో చాలామంది పెన్షన్ దరఖాస్తు చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకుండా పెన్షన్ల దరఖాస్తు గడువును వెంటనే ఈ నెల 25 వరకు పొడిగించాలని కోరారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పులిపాటి దుర్గారెడ్డి, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆదేశాల మేరకు ఈ వినతిపత్రం అందజేసినట్లు పోసి కుమార్ తెలిపారు.

# 40 ఏళ్ల లో-వోల్టేజ్‌కు స్వస్తి

## ఎమ్మెల్యే కొణతాల, ఇన్ ఛార్జ్ రాంకీ ల ఆదేశాలతో త్రీ-ఫేజ్ 'పవర్'

**అనకాపల్లి: జయ జయహే**



పట్టణంలోని విజయరామరాజుపేట, శ్రీబాల గణపతి దేవాలయం పరిసర ప్రాంత వాసుల దశాబ్దాల కష్టాలకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. దాదాపు 40 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో కేవలం 20 నుండి 25 ఇళ్లు మాత్రమే ఉన్న సమయంలో వేసిన సింగిల్-ఫేజ్ విద్యుత్ లైన్ ద్వారానే ఇప్పటివరకు సరఫరా జరుగుతుండేది. అయితే కాలక్రమేణా నివాసాల సంఖ్య 60కి పైగా పెరిగినప్పటికీ పాత విద్యుత్ వ్యవస్థనే కొనసాగించడంతో, పెరిగిన లోడ్‌ను తట్టుకోలేక స్థానికులు తీవ్ర లో-వోల్టేజ్ సమస్యతో నరకయాతన అనుభవించారు. ముఖ్యంగా ప్రతీ వేసవి కాలంలోనూ ఏసీలు పనిచేయక, ఫ్యాన్లు సరిగ్గా తిరగక, పవర్ ఫ్లక్చుయేషన్స్ వల్ల ఫ్రిజ్లు, టీవీలు కాలిపోయి ప్రజలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని, నిద్రలేని రాత్రులను గడిపారు. ఈ తీవ్రమైన ఇబ్బందులను గమనించిన జీవీఎంసీ 82వ వార్డు జనసేన పార్టీ కన్వీనర్ ఆళ్ల ఇందు రామచంద్రరావు వెంటనే స్పందించి, సమస్య తీవ్రతను స్థానిక ఎమ్మెల్యే , జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ భీమరశెట్టి రాంకీ ల దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సహకారంతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ, పాత శిథిలమైన పోల్స్, వైర్లను పూర్తిగా తొలగింపజేశారు. యుద్ధప్రాతిపదికన నూతన కాంక్రీట్ విద్యుత్ స్థంభాలను నాటించి, అధునాతన సామర్థ్యం కలిగిన త్రీ-ఫేజ్ విద్యుత్ లైన్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. 40 ఏళ్లుగా వేధిస్తున్న క్లిష్టమైన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కు, ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసిన నియోజక వర్గ ఇన్ ఛార్జ్ భీమరశెట్టి రాంకీ కు,. అలాగే....పనులను దగ్గర ఉండి చూసుకున్న వార్డు జనసేన పార్టీ కన్వీనర్ ఆళ్ల ఇందు రామచంద్రరావు కి మరియు విద్యుత్ అధికారులకు బాల గణపతి ఆలయ ప్రాంత నివాసితులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.




# స్థానిక సంస్థల ఎన్నికల విజయం మనదే కావాలి

## వైయస్సార్సీపి బలోపేతానికి పని చేయాలి

## వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్ పిలుపు

**టెక్కలి సెప్టెంబర్ 15 జయ జయహే**

గ్రామస్థాయిలో కష్టించి పనిచేసి వైఎస్ఆర్సిపి బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో మనమే విజయం సాధించాలని శ్రీకాకుళం జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్ పిలుపునిచ్చారు, టెక్కలి ఆదిత్య కల్యాణ మండపంలో జరిగిన వైకాపా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సు టెక్కలి వైకాపా సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యంలో జరిగింది. ఏపీ ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. నియోజకవర్గంలో వైకాపా విజయశీ సాధించి జెండా ఎగరవేయాలని పలువురు నేతలు సూచించారు. ఈ సమావేశంలో వైకాపా నేతలు కుంభ రవిబాబు,మామిడి శ్రీకాంత్, టెక్కలి వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు హనుమంతు వెంకు నాయుడు, పేడాడ రమేష్, సత్తారు సత్యం, దువ్వాడ వాణి, నడిపూడి శ్రీరామ్ మూర్తి, పాల వసంత రెడ్డి, రోణంకి ఉమా మల్లయ్య, గురునాథ్ యాదవ్, ఆట్ల సరోజిని, అట్ల రాహుల్, కిల్లి అజయ్, తమన్నా గారి కిరణ్ , కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతులను అణచలేరు

**ప్రజాగ్రహాన్ని ఆపలేరు: జక్కంపూడి రాజా**

**రాజమహేంద్రవరం, జయ జయహే: సెప్టెంబర్ 16:**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో పాలన సాగిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆరోపించారు. ఎన్నికల హామీలను విస్మరించి, ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను కేసులు, సోషల్ మీడియా ఖాతాల బ్లాక్‌లు, ఆంక్షలతో అణచివేయాలని ప్రయత్నించడం సరికాదన్నారు.రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జక్కంపూడి రాజా మాట్లాడుతూ.. గడిచిన రెండేళ్లలో రాష్ట్రంలో దాడులు, హింసాత్మక ఘటనలు పెరిగాయని, సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా కార్యకర్తలు, జర్నలిస్టులపై కేసులు నమోదు చేసి భయపెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో చురుగ్గా ఉండే యువత, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు, ఉపాధ్యాయుల వివరాలను సేకరిస్తున్నారని రాజా ఆరోపించారు. ప్రశ్నించే వారిపై నిఘా పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.రాజమహేంద్రవరంలోని ప్రియాంక ఘటనతో పాటు రాష్ట్రంలో మహిళలు, చిన్నారులు, విద్యార్థులపై జరుగుతున్న నేరాలు, డ్రగ్స్, గంజాయి, అక్రమ మద్యం, కబ్జాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.తిరుపతిలో స్టైఫండ్‌పై స్పష్టత కోరిన విద్యార్థులపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడ్డారని రాజా ఆరోపించారు. ప్రశ్నించిన విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం, విద్యార్థినులను ఈడ్చుకెళ్లడం ప్రజాస్వామ్య పద్ధతి కాదన్నారు.కోచింగ్ సెంటర్లపై దాడులు, లైసెన్సుల పేరుతో బెదిరింపులుమానుకోవాలని సూచించారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజల ఆగ్రహాన్ని అణచివేతతో ఆపలేరని హెచ్చరించారు.డీఎస్సీపై ప్రశ్నించిన యువత సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేయడం, కంటెంట్‌ను తొలగించడం ద్వారా వారి సమస్యలను పరిష్కరించలేరన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఎపి డీఎస్సీపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ప్రభుత్వంపై మాట్లాడిన వారందరి సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేసే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు.ఈస్ట్ జర్మనీ స్టాసీ వ్యవస్థ, బెర్లిన్ గోడ కూల్చివేత, ఈజిప్టులో హోస్నీ ముబారక్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం, శ్రీలంకలో యువత ఉద్యమం వంటి ఘటనలను ప్రస్తావిస్తూ.. సోషల్ మీడియాను నియంత్రించగలరేమో కానీ ప్రజల ఆవేదనను నియంత్రించలేరని అన్నారు.వైఎస్సార్‌సిపి ప్రభుత్వ హయాంలో 1.35 లక్షల సచివాలయ ఉద్యోగాల నియామకాలు చేపట్టామని రాజా తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రూ.3 వేల నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్‌తో పాటు ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాకపోతే ప్రజలకు క్షమాపణ చెప్పాలని చంద్రబాబును కోరారు. అణచివేతతో యువత, ప్రజాగ్రహాన్ని ఆపలేరని, చరిత్రలో నియంతృత్వ పాలనలు కాలగర్భంలో కలిసిపోయాయని జక్కంపూడి రాజా వ్యాఖ్యానించారు.సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మోటారు బోర్లు పనులు ప్రారంభించిన గరే గురునాథ్

**మధురవాడ,జయ జయహే:**

జీవీఎంసీ ఆరో వార్డు పరిధిలో నీటి సమస్యలపై కూటమి ప్రభుత్వం నిరంతరం పాటు పడుతుందని ఆరో వార్డు టిడిపి అధ్యక్షుడు గరే గురునాథ్ తెలిపారు. పిఎం పాలెం ఎస్ సి కాలనీ సమీపంలో ఉన్న లక్ష్మీవాణి పాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం నాడు మోటారు బోరు పనులను గరే గురునాథ్ చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గం మొత్తం మీద నీటి ఎద్దడిపై భీమిలి శాసనసభ్యులు గంట శ్రీనివాసరావు నిరంతరం అధికారులతో చర్చలు జరిపి ప్రజలకు త్రాగునీటినీ సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.అందులో భాగంగానే లక్ష్మీవాణి పాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారనే సమస్యను ఆయన దృష్టికి తీసుకొని వెళ్లగా తక్షణమే ఆయన స్పందించి మోటారు బోరు వెయ్యాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.వేసవి కాలంలో త్రాగునీటికీ ప్రజలు ఇబ్బందులకి గురికాకుండా తక్షణమే చేతిపంపు బోర్లును వెయ్యాలని భీమిలి శాసన సభ్యులు గంట శ్రీనివాసరావు జోన్ టు నీటి సరఫరా విభాగం అధికారులకు ఆదేశించానీ గురునాథ్తెలిపారు.వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు తీసుకొని వార్డులో ప్రజలు దాహార్తిని తీర్చేందుకు గంట శ్రీనివాసరావు తీసుకున్న చర్యలు పట్ల ఆ ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంట శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు వార్డు అధ్యక్షుడు గరే గురునాథ్ ఆధ్వర్యంలో చెతిబోర్లు పనులను మంగళవారం నాడు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఆరో వార్డు బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, కొప్పాక రామకృష్ణ, వాటర్ సప్లై విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నిశ్శబ్ద సేవకులకు జేసీఐ సత్కారం

**విశాఖపట్నం, సెప్టెంబర్ 15, జయ జయహే**

జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జె.సి.ఐ.) వారోత్సవాల్లో సెల్యూట్ ద సైలెంట్ స్టార్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏపీఎసఆర్టీసీలో లగేజీలు మోసే కళాశీలను సత్కరించారు. నిత్యం పార్సిల్ సర్వీస్ లోను, ప్రయాణికులకు సేవలు అందించే కళాశీలను గుర్తిస్తూ జేసీఐ వైజాగ్ ప్రతినిధులు వారి సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ సీటీఎం కె. పద్మావతి, ఆర్టీసీ అధికారులు కే.గంగాధర్ రావు, జీజీవీ రమణ, కేఎం. కృష్ణ, జీఎన్.మూర్తి, వైజాగ్ వైస్ ప్రెసిడెంట్ కె.ఎం.కె.రమేష్, జేసీఐ వారోత్సవాల కో ఆర్డినేటర్ మౌళి, సెల్యూట్ ద సైలెంట్ స్టార్ కార్యక్రమం కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, గాయత్రి, దిలీప్, ప్రకాష్, ప్రజ్ఞ, వేణు తదితరులు పాల్గొన్నారు.



## ఉక్కునగరం సమితిలో భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 15, జయ జయహే**

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య అనుగ్రహంతో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, ఉక్కునగరం సమితి ఆధ్వర్యంలో శ్రీ వినాయక చవితి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీ వినాయక విగ్రహ ప్రతిష్ఠ, ప్రక్షాళన, అభిషేక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.అనంతరం బాలవికాస్ విద్యార్థులు, యువత ఆధ్వర్యంలో శ్రీ గణేశ పూజా కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగింది. పూజా కార్యక్రమాన్ని జయ గౌరీ కామేశ్వరి, రత్నకుమార్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం సమితి ప్రధాన భజన గాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.ఈ సంవత్సరం ఉక్కునగరం సమితిలో శ్రీ వినాయక చవితి వేడుకలను ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా సెప్టెంబర్ 19న విశాఖలోని ఆర్.కే. బీచ్‌లో, విశాఖ జిల్లా పరిధిలోని వివిధ సమితుల వినాయక విగ్రహాలతో కలిసి సామూహిక నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ ఆర్.ఏ. నాయుడు, ఉక్కు నగరం కన్వీనర్ డీఏవీ సన్యాసి రాజు, అగనంపూడి, కూర్మన్నపాలెం ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## మహిళల భద్రత చట్టాలుపై అవగాహన కార్యక్రమం

**అరకు సీఐ: కోటేశ్వరరావు**

**అరకులోయ: సెప్టెంబర్ 15. జయ జయహే.**

అరకు వేలి మహిళ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పానిరంగిని లో మహిళల భద్రత మన బాధ్యత అనే కార్యక్రమాన్ని అరకు సీఐ ఏ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో డీఎస్పీ వేణుగోపాల్ అరకు సీఐ మాట్లాడుతూ, ప్రతి ఒక్క మహిళలకు మహిళా భద్రత చట్టాలు పై అవగాహన కలిగి ఉండాలని మహిళలకు ఉన్న చట్టాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అవగాహన కల్పిస్తూ మహిళలకు మహిళలంటే గౌరవం ప్రేమ అనురాగం తో మహిళలను చూడాలని మహిళలకు ఉన్న చట్టాల గురించి ప్రతి మహిళలకు తెలిసేలా అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాట్లు చేసేలా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశించారు,మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ధైర్యంగా ముందుకు వచ్చి మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కు చెప్పుకోవాలని తెలియజేస్తూ మీ భద్రతే మా బాధ్యత మహిళా హింసకు వ్యతిరేకంగా పోరాడండి అని మహిళలకు సూచించారు, సోషల్ మీడియాకు దూరంగా ఉండి ఎవరు కూడా మోస పోవద్దని శక్తి యాప్ ప్రతి ఒక్క మహిళలు మీ ఫోన్ లో డౌన్లోడ్ చేసుకోవాలని మీకు ఏ రకమైన ఇబ్బందులు ఏర్పడిన వెంటనే శక్తి యాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని తెలియజేస్తూ ఫాక్స్ ఆక్ట్ చట్టం గురించి అవగాహన తెలియజేశారు ,ఈ కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు,

## నిర్మాణరంగం అభివృద్ధి చెందాలంటే “లైసెన్స్ ఇంజనీర్ల వ్యవస్థ”ను ప్రభుత్వం గుర్తించాలి

**క్లసా చైర్మన్ ముని శ్రీనివాసరావు**

**శ్రీకాకుళం. (జయ జయహే )**




శ్రీకాకుళం పట్నంలో 65వ ఇంజనీర్స్ డే వేడుకలను ప్రైవేట్ కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. భారతదేశం గర్వించదగ్గ ప్రముఖ ఇంజనీర్లు అందరికీ ఆదర్శమూర్తి భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని ఏపీ కన్ఫెడరేషన్ ఆఫ్ లైసెన్స్ ఇంజనీర్స్, సర్వేయర్స్ అండ్ ఆర్కిటెక్ట్ (క్లసా) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం మాజీ శాసనసభ్యులు గుండా లక్ష్మీదేవి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలవుతున్న నూతన విధానాలతో పనుల్లో బాధ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు. ఇంజనీర్లు దేశ అభివృద్ధిలో కీలకమని వారికి తగిన ప్రోత్సాహం అందిస్తే, దేశం మరింత ముందుకు వెళుతుందని అన్నారు. శ్రీకాకుళం జిల్లా వైసిపి యువ నాయకులు ధర్మాన రామ్మోహర్ నాయుడు మాట్లాడుతూ... దేశ ఆర్థిక వ్యవస్థలో ఇంజనీరింగ్ విభాగానిది ఎంతో కీలక పాత్రని, దేశంలో ఇప్పుడు చాలా ప్రాజెక్టులు వెలుస్తున్నాయి అంటే అందులో ఇంజనీర్లు పాత్ర ఎంతుందో అని కొనియాడారు. అనంతరం ఏపీ కన్ఫెడరేషన్ ఆఫ్ లైసెన్స్ ఇంజనీర్స్, సర్వేయర్స్ అండ్ ఆర్కిటెక్ట్ (క్లసా) చైర్మన్ ముని శ్రీనివాసరావు మాట్లాడుతూ... దేశం అభివృద్ధి చెందాలంటే పట్నాలు, పల్లెల్లో నిర్మాణరంగం అభివృద్ధి చెందాలంటే లైసెన్స్ ఇంజనీర్లు, ఆ వ్యవస్థను ప్రభుత్వం గుర్తించి ఎంతో ప్రోత్సాహం ఇవ్వాలని, జీవోల రూపకల్పనలో బిల్డర్లు, డెవలపర్లు కాకుండా ఎల్ టిపి అసోసియేషన్ ని కూడా భాగస్వాములుగా చేర్చుకోవాలని అన్నారు.



## నీ హక్కులను తెలుసుకో మోసాలను అడ్డుకో

**అనకాపల్లి జయ జయహే**

పౌరుల హక్కులను బలోపేతం చేయడంలో సమాచార హక్కు చట్టం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల ఆహార పౌరసరఫరాల విజిలెన్స్ కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ స్పష్టం చేశారు కేంద్ర యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ గొర్లి మహేశ్వర రావు అధ్యక్షతన ప్రజా ప్రయోజనాలు చట్టాలు పై మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో పారదర్శకత జవాబు దారి తనం తీసుకోవడానికి ఆర్టిఐ చట్టాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు వినియోగదారులు హక్కులు సేవలు వస్తువులు కొనుగోలు చేసే సమయంలో ప్రతి ఒక్కరు తమ హక్కులను తెలుసుకోవాలని అన్నారు మోసాలకు గురైన లేదా నాసిక రకం సేవలు ఎదురైనా వెనుకాడకుండా చట్టపరంగా పరిష్కారం పొందాలని అన్నారు ఆహార భద్రత చట్టం ద్వారా నిరుపేద కుటుంబాలకు అందుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థ పై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు పథకాలపై అప్రమత్తత అవసరమని ప్రజా ప్రయోజనాల కోసం రూపొందించిన చట్టాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ముందు కోసం అవగాహన కార్యక్రమం మరింత విస్తృతం కావలసిన అవసరం ఉందన్నారు చట్టాలపై యువత పూర్తిగా అవగాహన పెంచుకోవాలని బాధ్యతలపై సమాజంలో చైతన్యం కల్పించాలని ప్రజాసంక్షేమ పారదర్శకత పాలన హక్కుల పరిరక్షణ పటిష్టమైన ప్రజాస్వామ్యానికి అసలైన పునాదులని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు శ్రీరంగం రామన్న దొర వి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా వికసి భారత్ యంగ్ లీడర్ డైలాగ్స్ బ్రోచర్ విడుదల చేశారు

# ఇచ్ఛాపురం నుంచి నూతన తరం విద్యకు నాంది

**రైజ్ గ్లోబల్ క్యాంపస్ లోగో ఆవిష్కరించిన ఎమ్మెల్యే బెందాళం అశోక్**

**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 15, జయ జయహే**




ఇచ్ఛాపురం ప్రాంతంలో విద్యా రంగానికి మరింత ప్రాధాన్యత తీసుకురావడంతో పాటు, విద్యార్థులను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న రైజ్ గ్లోబల్ క్యాంపస్ కు సంబంధించిన లోగోను ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆవిష్కరించారు. శాంకరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రైజ్ సంస్థల అధినేత చైర్మన్ డాక్టర్ ప్రవీణ్ పుల్లట ఈ విద్యా సంస్థను స్థాపిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాట్లాడుతూ, ఇచ్ఛాపురం వంటి ప్రాంతం నుంచి ప్రపంచస్థాయి విద్యకు బాటలు వేయడం అభినందనీయ మన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తకాల పరిజ్ఞానం అందించడం మాత్రమే కాకుండా, భవిష్యత్‌లో అవసరమయ్యే నైపుణ్యాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. “విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నూతన ఆలోచనలతో ప్రవీణ్ పుల్లట ఈ విద్యా సంస్థను ఏర్పాటు చేస్తుండటం అభినందనీయం. ఇచ్ఛాపురం ప్రాంత విద్యార్థులకు మంచి విద్యా అవకాశాలు అందుబాటులోకి రావాలి. రైజ్ గ్లోబల్ క్యాంపస్ ద్వారా స్థానిక విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక విద్య అందుతుందని ఆశిస్తున్నాను” అని అశోక్ పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు కేవలం అకడమిక్ విద్యతోనే కాకుండా లైఫ్ స్కిల్స్, ట్రేడ్ స్కిల్స్, అగ్రికల్చర్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ వంటి విభిన్న నైపుణ్యాలను కూడా అభ్యసించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా రైజ్ గ్లోబల్ క్యాంపస్ ప్రత్యేక దృష్టి పెట్టడం మంచి పరిణామమన్నారు. రైజ్ సంస్థల అధినేత, చైర్మన్ డాక్టర్ ప్రవీణ్ పుల్లట మాట్లాడుతూ, “మారుమూల ప్రాంతం నుంచి సమున్నత విద్యను అందించడమే రైజ్ గ్లోబల్ క్యాంపస్ ప్రధాన లక్ష్యం. విద్యార్థులను కేవలం ఉద్యోగాలకు సిద్ధం చేయడం కాకుండా, ఆయా రంగాల్లో భావి నాయకులుగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం” అని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్, సమస్య పరిష్కార సామర్థ్యం, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించేలా విద్యా విధానాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. “ఇచ్ఛాపురం నుంచి న్యూ జనరేషన్ ఎడ్యుకేషన్ ప్రారంభం కావాలి. ఇక్కడ చదివే విద్యార్థులు భవిష్యత్తులో దేశ, ప్రపంచ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునేలా రైజ్ గ్లోబల్ క్యాంపస్‌ను తీర్చిదిద్దుతాం” అని డా. ప్రవీణ్ పుల్లట అన్నారు. ఈ కార్యక్రమంలో రైజ్ టీమ్ సభ్యులు పి. గౌరి పవని, సీనియర్ జర్నలిస్ట్ జి. షణ్ముఖరావు, ప్రదీప్, పిరియా సంతోష్ , నర్తు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురం నుంచి ప్రారంభమవుతున్న ఈ విద్యా ప్రయాణం ద్వారా శ్రీకాకుళం జిల్లా విద్యార్థులకు ఆధునిక, నైపుణ్యాధారిత, విలువలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## రవీంద్ర నగర్లో ఘనంగా వినాయక పూజలు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 15, జయ జయహే :**

కంచరపాలెం పరిధి ఊర్వశి జంక్షన్ సమీప రవీంద్రనగర్ గ్రామంలో 12వ సంవత్సర వినాయక మహోత్సవం ఘనంగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి భక్తి శ్రద్ధలతో వినాయకునికి పూజలు చేశారు. ఎలాంటి విఘ్నాలు లేకుండా తమను కాపాడాలని కోరుతూ హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బేత భాస్కరరావు, వేణు సుబ్రహ్మణ్యం, రవికుమార్, జగన్మోహన్ రావు, చంద్రమౌళి, ఉమా మహేశ్వరరావు, జగదీష్, త్రినాధ్, నరసింహ మూర్తి లక్ష్మి, కుమారి పద్మ,సోని, మౌనిక, వర్షని, నీరజ తదితరులు పూజల్లో పాల్గొన్నారు..

# అనుమానం.. కిడ్నాప్

(ప్రతాప్)




పుణెలో అర్ధరాత్రి ఒక్కసారిగా కలకలం రేగింది. సెప్టెంబర్ 4 తెల్లవారుజామున సుమారు 12.30 గంటల సమయంలో పెరూగేట్‌లోని చిమణ్య గణపతి ఆలయం సమీపంలో 28 ఏళ్ల ప్రసాద్ సూర్యవంశీపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. అతను సహాయం కోసం కేకలు వేస్తుండగానే, నల్లరంగు వాహనంలోకి బలవంతంగా ఎక్కించి అక్కడి నుంచి వేగంగా తీసుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఇది సాధారణ దాడి కాదు---ఒక అనుమానిత ప్రేమ వ్యవహారం ఈ అపహరణకు కారణమై ఉండవచ్చని దర్యాప్తులో తేలింది.

అయితే నిందితుల పథకం ఎక్కువసేపు సాగలేదు. అక్కడే ఉన్న ప్రసాద్ స్నేహితుడు మొత్తం ఘటనను గమనించి వెంటనే పోలీసు కంట్రోల్ రూముకు సమాచారం అందించాడు. అదే సమయంలో సమీపంలోని ఓ ఇంటి నివాసి కిటికీ నుంచి జరుగుతున్న ఘటనను తన కెమెరాలో చిత్రీకరించాడు. ఈ దృశ్యాలు దర్యాప్తులో కీలక ఆధారాలుగా మారాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. వాహనం వెళ్లిన మార్గాన్ని గుర్తిస్తూ గాలింపు ప్రారంభించారు.

సమయం వృథా చేయకుండా పోలీసులు వెంటపడ్డారు. సుమారు 45 నిమిషాల నుంచి గంటలోపే సింహగఢ్ రోడ్డుపై ఆ వాహనాన్ని గుర్తించారు. వెంటనే దాడి చేసి ప్రసాద్‌ను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. దాడిలో గాయపడిన అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. అదే సమయంలో ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వారిలో వాల్చంద్‌నగర్‌కు చెందిన హోటల్ నిర్వాహకుడు సాగర్ రమేశ్ బోరాడే, అతని సహాయకుడు కిషోర్ బాలాసాహెబ్ సావంత్ ఉన్నారు. మరో ఇద్దరు వ్యక్తులు కూడా ఈ ఘటనలో పాల్గొన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వారి కోసం గాలింపు కొనసాగుతోంది. అనంతరం ప్రసాద్‌తో పాటు అరెస్టయిన ఇద్దరినీ విశ్రాంత్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేశారు.

అసలు ఈ దారుణానికి కారణమేంటి? పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, బోరాడే ఒక యువతితో సంబంధంలో ఉన్నాడు. ఆ యువతి మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. ప్రసాద్ కూడా ఆమెతో పరీక్షలకు సంబంధించిన విషయాలపై మాట్లాడటం, చదువుకు సంబంధించిన సమాచారాన్ని పంచుకోవడం చేసేవాడు. ఈ పరిచయాన్ని బోరాడే అనుమానంగా తీసుకున్నాడని పోలీసులు చెబుతున్నారు. తనతో సంబంధంలో ఉన్న యువతికి ప్రసాద్ దగ్గరవుతున్నాడనే అనుమానంతో అతడిపై దాడి చేసి అపహరించేందుకు సహచరులతో కలిసి పథకం వేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

అయితే ఈ ఘటనలో అత్యంత కీలకమైన అంశం---ఒక స్నేహితుడి అప్రమత్తత, ఒక పౌరుడి వీడియో, పోలీసుల వేగవంతమైన స్పందన కలిసి ఒక ప్రాణాన్ని గంటలోపే కాపాడాయి. అదే సమయంలో, కేవలం అనుమానం ఆధారంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే వ్యక్తిగత వివాదం ఎంతటి తీవ్రమైన నేరంగా మారుతుందో ఈ ఘటన హెచ్చరిస్తోంది. ప్రేమలోనైనా, సంబంధాల్లోనైనా అనుమానానికి పరిష్కారం హింస కాదు; చట్టాన్ని ఆశ్రయించడమే మార్గం.

(మీడియా వార్తల ఆధారంగా)




## జాతీయ స్థాయి పర్యావరణం--ప్రకృతి క్విజ్‌లో డిగ్రీ కళాశాల విద్యార్ధుల ప్రతిభ

**చోడవరం సెప్టెంబరు 15 జయ జయహే**

చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్ధులు అపోలో టైర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహించిన జాతీయ స్థాయి ఎన్విరాన్మెంట్ నేచర్ క్విజ్ పోటీలో ప్రతిభ కనబరిచారు.కళాశాలకు చెందిన కె. రామ్ చరణ్, వై. లావణ్య ఈ క్విజ్ పోటీలో పాల్గొని ద్వితీయ స్థానాన్ని సాధించి, తదుపరి దశ అయిన జాతీయ స్థాయి ఫైనల్స్‌కు అర్హత సాధించారు.పర్యావరణం, ప్రకృతి పరిరక్షణ, జీవ వైవిధ్యం తదితర అంశాలపై తమ పరిజ్ఞానాన్ని ప్రదర్శించి విద్యార్ధులు ఈ విజయాన్ని సాధించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కిరణ్ కుమార్ విద్యార్ధులను అభినందిస్తూ, పర్యావరణ పరిరక్షణపై విద్యార్ధుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు జాతీయ స్థాయి పోటీల్లో కళాశాలకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు.విద్యార్ధుల విజయానికి కృషి చేసిన అధ్యాపకులు డా.వి రత్న భారతీ మరియు డా ఎస్. పద్మా వతి ల ను, విద్యార్ధులను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



## పోలింగ్ స్టేషన్స్ డ్రాఫ్ట్ పబ్లికేషన్

**మాడుగుల, సెప్టెంబర్ 15,జయ జయ హే**

ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ ల ఏర్పాట్లపై అధికారులు ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. దానిలో భాగంగా సోమవారం పోలింగ్ స్టేషన్లో డ్రాఫ్ట్ జాబితా సిద్ధం చేశారు . మంగళవారం పోలీస్ స్టేషన్లో డ్రాఫ్ట్ లిస్టు అప్లికేషన్ చేస్తారు. ఈనెల 16 వరకు వాటిపై అభ్యంతరాలు ఫిర్యాదులు స్వీకరిస్తారు. 16వ తేదీన పోలింగ్ స్టేషన్లపై రాజకీయ పార్టీల తో సమావేశ నిర్వహిస్తారు. ఈనెల 18న జిల్లా ఎన్నికల అధికారి పోలింగ్ స్టేషన్లను నిర్ధారిస్తారు. ఈ నెల 19న పోలీస్ స్టేషన్లో ప్రకటిస్తారనీ ఎండిఓకే అప్పారావు తెలిపారు.



## బిజేపి మహిళ మోర్చా అధ్యక్షురాలుగా మాధురి నియామకం

**మాడుగుల సెప్టెంబర్ 15 జయ జయహే**

మాడుగుల గ్రామానికి చెందిన కర్రి మాధురిని బీజేపీ మండల మహిళ మోర్చా అధ్యక్షురాలిగా నియమిస్తూ జిల్లా పార్టీ ఆదేశాలు జారీ చేసింది.ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. తనను నియమించిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారాపురెడ్డి పరమేస్వరరావు కి ధన్యవాదములు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ తనపై ఉంచిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించి పార్టీ కోసం శక్తివంచన లేకుండా పచ్చేస్తానని హామీ ఇచ్చారు. మోడీ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 17 వ తేదీన మాడుగుల మండల కేంద్రంలో గల గెడ్డబడి వద్ద మెడికల క్యాంపు నిర్వహింస్తునట్లు తెలియచేసారు. ప్రజలు ఈ అవకాశంను వినియోగించు కోవాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ మహిళ మోర్చా జోనల్ ఇంచార్జ్ మండల సంతోషి సుబ్బలక్ష్మి, అల్లూరి జిల్లా ఇంచార్జి పుట్టా గంగయ్య, జనతా వారధి కన్వీనర్ దొగ్గా ఈశ్వర్ ప్రసాద్ బి ఎల్ ఏ నియోజకవర్గ ఇంచార్జి చల్ల సత్యనారాయణ, మండల ఇంచార్జ్ శివాజీ రాజ్, బీజేపీ మండల అధ్యక్షులు మెలిపాక స్వామి మండలంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు.




## గురజాడ జయంతిని రాష్ట్ర పండుగ నిర్వహించాలి. భీశెట్టి

**విజయనగరం (జయ జయహే)**

రచయితగా, పండితుడుగా కన్యాశుల్క నాటకం ద్వారా తెలుగు వారి రాజకీయ, సాంఘిక, సాహిత్య, జీవనం కి అద్దంపట్టే గొప్ప రచన చేసిన మహా కవి గురజాడ అప్పారావు 164 వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగ లా నిర్వహించాలని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డిని కోరారు మంగళవారం కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందచేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబర్ 21 సోమవారం మహా కవి గురజాడ 164 వ జయంతని ఆ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ కేజీ నుండి పీజీ వరకూ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు గురజాడ నేపథ్యం, వారు రాసిన రచనలు, తెలియ చెప్పాల్సిన అవసరం ఉందని ఇప్పటికే తాను సంస్కృతీక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సంస్కృతిక శాఖ రాష్ట్ర అధికారి మల్లికార్జున్ లకు వినతిపత్రం అంద చేసానని ప్రభుత్వం ప్రకటన కోసం ఎదురు చూస్తున్నామని భీశెట్టి అన్నారు ఆధునిక తెలుగు సాహిత్యం తో పాటుగా నేటి తరం యువత కి గురజాడ రాసిన కన్యాశుల్కశీ నాటకాన్ని రాష్ట్ర ప్రభుత్వం చూపించాలని, కన్యాశుల్కశీ ఆధునిక భాషా సాహిత్యాల అపూర్వ సృష్టి అనే విషయం అందరికీ అర్ధం కావాలని భీశెట్టి పిలుపు నిచ్చారు, జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని మంత్రులు సంస్కృతిక శాఖ అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారాని ఆయన అన్నారు



## అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం లక్ష నష్టం

**మాడుగుల సెప్టెంబర్ 15 జయ జయహే**

మాడుగుల మండలం సత్యవరం గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్నిపర్వతం లో పడాల నూకలమ్మకు చెందిన పూరిల్లు అగ్నికి ఆహుత అయింది. ఈ ప్రమాదంలో లక్ష ఆస్తి నష్టం సంభవించగా, మరో మూడు లక్షలు విలువైన ఆస్తులను అగ్నిమాకు సిబ్బంది రక్షించగలిగారు. స్థానిక ఎస్సై అందించిన సమాచారం మేరకు ఫైర్ ఆఫీసర్ బి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది వెంకటరావు, ఎస్కే మదీనా, మణికుమార్ శివ తదితరులు సంఘటన స్థలం చేరుకోని మంటలను అదుపు చేశారు. కేర్ లెస్ స్మోకింగ్ మూలంగానే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.



## ఫిల్మ్ నగర్ సెంటర్‌ను అభివృద్ధి చేయాలి: గంటా

**విశాఖపట్నం, సెప్టెంబర్ 15:(జయ జయహే)**

ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ ను ఉత్తమమైన వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. అధ్యక్షునిగా ఎన్నికైన నార్త్ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు మంగళవారం గంటాను మర్యాదపూర్వకంగా కలిశారు. సభ్యులందరినీ సమన్వయం చేసి కమిటీ ఏకగ్రీవం కావడానికి గంటా శ్రీనివాసరావు కృషి కారణమని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ద్వారా సభ్యులు ఆదర్శంగా నిలిచారని చెప్పారు. ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ భవిష్యత్ లో సొంత ప్రాంగణాన్ని సమకూర్చుకునేలా ప్రయత్నం చేయాలని, దానికి తన సహకారం ఉంటుందన్నారు. విశాఖ ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ కు 2014 - 19 లో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారని, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో ఇలాంటి సెంటర్ లు అవసరమని పేర్కొన్నారు.




## ఆహారంలో వైవిధ్యత ప్రోటీన్ అవసరం

**చోడవరం సెప్టెంబర్ 15 జయ జయహే**

రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని, చోడవరం సెక్టార్ పరిధిలో యడ్లవీధి, పిల్లవారి తోట, పెదబజారువీధి అంగన్వాడి కేంద్రాలలో మంగళవారం సిడిపిఓ వి మంగతాయారు ఆదేశాల మేరకు సూపర్వైజర్ బి.శాంతి ప్రియ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆహారంలో వైవిధ్యత తగినంత ప్రోటీన్ గురించి తల్లులందరికీ వివరించారు. అలాగే మునగాకు ప్రయోజనాలు చెపుతూ. రోజువారి వంటకాల్లో మునగాకు తప్పనిసరిగా వాడాలని,అలాగే రోజు వారి ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు, పప్పుదినుసులు వినియోగించాలని వివరించారు. ఈ కార్యక్రమశీలో అంగన్వాడీ కార్యకర్తలు అంగన్వాడి నిర్వహణ కమిటీ మెంబర్లు, తల్లులు పాల్గొన్నారు.



## ఎస్ఎంసి ఎన్నికలకు మోగిన నగారా

### నోటిఫికేషన్ విడుదల

**చోడవరం సెప్టెంబరు 15 జయ జయహే**

త్వరలో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ముందుగా పైలట్ ఎన్నికలుగా పాఠశాల స్థాయి విద్య కమిటీలకు ఎందుకు నిర్వహించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మంగళవారం మండల విద్యా వనరుల కేంద్రం వద్ద విద్యాశాఖ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 29న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎలా ఉన్నాయి. ఈ మేరకు సమగ్ర శిక్ష నుంచి నోటిఫికేషన్ విడుదలైంది. మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేయగా, ఈనెల 18 తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఎస్ఎంసి ఎన్నికల నిమిత్తం ఓటర్ల,(తల్లిదండ్రుల వివరాలు) జాబితాను పాఠశాల నోటీసు బోర్డులో ఏర్పాటు చేస్తారు. ఈనెల 25న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికల జాబితా పై వచ్చే అభ్యంతరాలు, ఫిర్యాదులు పరిష్కారం, అదేరోజు మధ్యాహ్నం 4 గంటలకు ఓటర్ల తుది జాబితా ప్రకటించడం జరుగుతదని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. అలాగే ఈనెల 29న మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎస్ఎంసి సభ్యుల ఎన్నిక, పునర్నిర్మాణం, అనంతరం చైర్పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక, తదుపరి నూతన పాల్కవర్గశీ తొలి సమావేశం నిర్వహించడం జరుగుతుందని కాబట్టి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ చొరవ చూపి తల్లిదండ్రులను చైతన్యపరిచి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటట్టు చూడాలని సూచించారు

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com